తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక వార్త

# గతంలో మరణించిన గోవుల ఫోటోలతో
# బ్లాక్ మెయిలింగ్

-తిరుపతిలో తొక్కిసలాటలో వారిద్దరి ప్రమేయం ?
-గోశాల నిర్వహణలో నిర్లక్ష్యం లేదు
-ఎస్వీగోశాల తనిఖీల్లో టిటిడి ఛైర్మన్ నాయుడు



తిరుమల,ఏప్రిల్ 13ప్రభాతవార్తప్రతినిధి:
తనకు వ్యవసాయం, రైతు కష్టాలు తెలుసునని, గోమాతలనుదైవంతో సమానంగా పూజిస్తామని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అన్నారు. గోశాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేదని, అంతేగాక ఎక్కడో మృతిచెందిన గోవుల ఫోటోలను,గత పాలనలో గోశాలలో మరణించిన గోవుల ఫోటోలను చూపి అసత్యప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎస్వీ గోశాలలో వంద గోవులు మరణించాయని మాజీ ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలపై ఆదివారం మధ్యాహ్నం టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు గోశాలను తనిఖీ చేశారు. టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాశ్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, రాష్ట్ర యాదవకార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, శాప్స్ ఛైర్మన్ ఎ.రవినాయుడు, టిడిపి మీడియా విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ బి.శ్రీధర్‌వర్మ, నగరపాలకసంస్థ ఉపమేయర్ ఆర్‌సి మునికృష్ణతో నిజనిర్ధారణ కమిటీతో పరిశీలించారు. టిటిడిపై బురదజల్లి రాజకీయ లబ్ధిపొందాలని చూస్తే దేవుడు క్షమించడని అన్నారు. గోశాలలో గోవులన్నీ ఆరోగ్యంగానే ఉన్నాయని, వాటికి పౌష్టికాహారమైన దాణా కూడా అందిస్తున్నారని తెలిపారు.వైసిసి నాయకులు అసత్యఆరోపణలు మానుకోవాలన్నారు. గోవులపై దుష్ప్రచారం చేస్తున్న ఆయనపై కేసులు పెడతామన్నారు. రాజకీయంగా పోరాడాలనుకుంటే రాజకీయాలు చేయొచ్చన్నారు. తనతో పెట్టుకుంటే పర్సనల్‌గా వస్తానన్నారు. దేనికైనా టైం రావాలని, భగవంతుడు ఖచ్చితంగా శిక్షిస్తాడని అన్నారు. టిటిడిలో ప్రక్షాళన మొదలుపెట్టామని చెప్పారు. ఇదిలా ఉండగా వైకుంఠ ఏకాదశికి ముందు టోకెన్ల జారీలో తొక్కిసలాటకు కూడా భూమన, హరనాథరెడ్డి ప్రమేయం ఉండవచ్చని ఛైర్మన్ బిఆర్‌నాయుడు సంచలన వ్యాఖ్యలుచేశారు. దీనిపై విచారణ జరుగుతోందన్నారు.

# శాస్త్రసోక్తంగా అమ్మవారికి “లక్ష కుంకుమార్చన”

చంద్రగిరి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయంలో ఆలయ ఈఓ మమత ఆదివారం ఆలయ అర్చకులు సూరి స్వామి ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చనకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఉదయం 7 గంటలకు గణపతి పూజ, కలశ స్థాపనలతో 15వ తేది మంగళవారం వరకు త్ర్యాహ్నిక దీక్ష విధానముగా లక్ష కుంకుమార్చనకు వేదపండితులు మొదలు పెట్టారు. ఈ సందర్భంగా సూరి స్వామి మాట్లాడుతూ వివాహం, సంతానం కొరకు, సర్వగ్రహ దోష నివారణకు, ఆరోగ్యం, విద్య వంటి కోర్కెలను తీర్చుకునేందుకు భక్తులు రూ.516/-లు చెల్లించి లక్ష కుంకుమార్చనలో పాల్గొనాలని కోరారు.

# పులికాట్ జాలర్ల కుప్పంలో
# తిరునాళ్లకు సిద్ధం

- వాటంబేడులో ఈ నెల 25 నుంచి శ్రీధర్మరాజస్వామి ఉత్సవాలు
- ఆంధ్రా, తమిళనాడు సాంప్రదాయాలతో మే 5 వరకు సందడి





తడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త
తడ మండలం వాటంబేడుకుప్పం వద్ద దశాబ్దాల క్రితం నిర్మించిన పంచపాండవ ద్రౌపతీ సమేత శ్రీధర్మరాజస్వామి దేవస్థానంలో ఈ నెల 25 నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతి 12 ఏళ్లకోసారి పులికాట్ సరస్సుపై ఆధారపడిన మత్స్యకారులు ఈ ఉత్సవాలు జరపడం ఆనవాయితీ. అయితే గతంలో కోవిడ్ వంటి కారణాలతో కొన్నేళ్ల పాటు ఉత్సవాలు నిలిచిపోయాయి. ఈసారి అత్యంత వైభవంగా ధర్మరాజస్వామి తిరునాళ్ల జరపడానికి గ్రామస్థులు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఆహ్వానపత్రికను విడుదల చేశారు. గ్రామంలో విద్యుత్, రోడ్లు వంటివి మరమ్మతులు చేయిస్తున్నారు. ఆలయాన్ని సరికొత్తగా ముస్తాబు చేశారు. ధ్వజస్తంభం ప్రతిష్ఠ మరియు జీర్ణోధరణ మహాకుంభాభిషేకం కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు వాటంబేడు కుప్పం గ్రామపెద్దలు తెలిపారు. ఆంధ్రా, తమిళనాడు రాష్ట్రాల సాంప్రదాయాలతో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. సాధారణంగా ధర్మరాజులస్వామికి పూర్వపు చిత్తూరు జిల్లాలో మాత్రమే ఆలయాలు ఉండేవి. పూర్వపు నెల్లూరు జిల్లాలో ధర్మరాజస్వామి ఆలయాలు ఉన్న అతి తక్కువ ఊళ్లలో వాటంబేడుకుప్పం ఒకటి. సూళ్లూరుపేట నుంచి 8 కిలోమీటర్ల దూరంలో పులికాట్ సరస్సు ఒడ్డున వాటంబేడు గ్రామ పంచాయతీ పరిధిలోని వాటంబేడుకుప్పం వద్ద ఈ ఆలయం ఉంది. ఇప్పటికే కమిటీలు వేసుకుని పండగ ఏర్పాట్లు ముమ్మరం చేశారు. అత్యంత ఆధునిక విద్యుద్దీపాలంకరణలు వంటివి ఏర్పాటు చేస్తున్నారు. పండుగ జరిగినన్ని రోజులు సాంప్రదాయబద్ధంగా మహాభారత ప్రవచనాలు విశేషంగా ఆకట్టుకోనున్నాయి. రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను కూడా భారీఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. మహాభారత పఠనాలలో అర్జున తపస్సు, ఉత్తర గోగ్రహణం వంటివి అత్యంత ప్రాధాన్యత కలిగినవి. ఆదిపర్వం నుంచి ధర్మరాజుల పట్టాభిషేకం వరకు అనుభవజ్ఞులైన పెద్దలచే మహాభారతం గురించి ప్రతిరోజు ఒక ఘట్టం చదివి వినిపిస్తారు. తడ మండల పరిధిలోని జాలర్ల కుప్పాలతో పాటు నెల్లూరు, తిరుపతి జిల్లాలకు చెందిన పులికాట్ సముద్ర తీర మత్స్యకార గ్రామాలు, తమిళనాడు పరిధిలోని తీరప్రాంత గ్రామాల వారు పెద్దసంఖ్యలో తరలిరానున్నారు. దీనికితోడు సూళ్లూరుపేట, సత్యవేడు వంటి అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి తిరునాళ్ల తిలకించేందుకు, సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించేందుకు ఎక్కువమంది తరలి వస్తారని అంచనా వేస్తున్నారు. వాటంబేడుకుప్పం స్థానిక కళాకారుల చేత కార్యక్రమాలు కూడా ఈ సారి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని గ్రామపెద్దలు తెలిపారు. తిరునాళ్ల ప్రాభవాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని వారు కోరుతున్నారు.
.

# ముస్తాబవుతున్న సూళ్లూరుపేట రైల్వేస్టేషన్

సూళ్లూరుపేట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ తుదిమెరుగులు దిద్దుకుని ప్రారంభానికి ముస్తాబవుతోంది. కేంద్రప్రభుత్వం అమృత్‌భారత్ పథకం కింద దేశ వ్యాప్తంగా రైల్వేస్టేషన్లను ఆధునికీకరించే ప్రక్రియలో భాగంగా సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌కు రూ.11 కోట్లు నిధులు కేటాయించారు. అనంతరం రూ.12 కోట్లు విడుదల చేశారు. దీంతో సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ ఆధునీకరణ శరవేగంగా జరుగుతోంది. బుకింగ్ కౌంటర్, ప్రధాన ద్వారం, ప్రయాణికుల వసతి, ప్లాట్‌ఫారంల ఆధునీకరణ, లిఫ్ట్ సౌకర్యం నూతనంగా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు రైల్వేస్టేషన్ ప్రధాన ద్వారానికి చెంగాళమ్మఆలయానికి సంబంధించిన నమూనాతో ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. దీనికితోడు రంగు రంగుల విద్యుద్దీపాల వెలుగులు ఏర్పాటు చేయడంతో రైల్వేస్టేషన్‌కు నూతన శోభ చేకూరింది. ఈ నెల 18న రైల్వేస్టేషన్‌ను లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలిసింది.

# సాంప్రదాయాలు పాటిస్తూ...తలనీలాలు సమర్పించిన
# డిప్యూటీ సిఎం భార్య అన్నాలెజినోవా





తిరుమల,ఏప్రిల్ 13 ప్రభాతవార్తప్రతినిధి:
ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ భార్య అన్నాలెజి నోవా ఆదివారం రాత్రి కుమారుడు మార్క్‌శంకర్‌తో కలసి తిరుమలకు వచ్చారు. ఆమె హిందూ సాంప్రదాయాలు పాటిస్తూ తొలుత డిక్లరేషన్‌పై సంతకం చేశారు. అనంతరం ఆమె కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించరు ఆమెకు డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఓఎస్‌డి సత్రానాయక్ స్వాగతం పలికారు.

# బోయకొండ రోప్‌వేకు
# ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

-తీరునున్న భక్తుల ఆకాంక్ష



చౌడేపల్లి ఏప్రిల్ 13 ప్రభాతవార్త
శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద రోప్‌వేకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో భక్తుల్లో చిరకాలంగా వున్న రోప్‌వే ఆశ నెరవేరనుంది. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని పర్యాటంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతోంది. పర్యాటక రంగానికి ఊతమిచ్చే దిశగా అడుగులు వేస్తోంది. ఈక్రమంలో దేవస్థానాల వద్ద రోప్‌వే ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. నేషనల్ హైవేస్ రాష్ట్రంలోని 5ప్రాంతాల్లో రోప్‌వే ప్రాజెక్టుల నిర్మాణానికి గాను డిపిఆర్ తయారీకి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయం, కర్నూలు అహోబిలం, పల్నాడు జిల్లాలోని కోటప్పకొండ, విజయవాడలోని భవానీ ద్వీపం, తూగోజిల్లా కోరుకొండలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయాల్లో రోప్‌వే నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద దిగువ ఆలయం నుంచి కొండపై వరకు 0.68కిలోమీటర్ల మేర రోప్‌వే నిర్మాణానికి కసరత్తు జరుగుతోంది. ఈ మేరకు పర్యాటకశాఖ ఆధ్వర్యంలో స్థల పరిశీలన సైతం జరిగింది. దీంతో భక్తుల్లో ఆనందోత్సాలు వెల్లివిరుస్తున్నాయి.

# గడ్డివాముల దగ్ధాల వెనుక మర్మమేమి స్వామీ...?

-వరుస దగ్ధాలతో భీతెల్కుతున్న రైతన్నలు

చౌడేపల్లి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త
రాత్రిళ్ళు పడుకొని వుంటే పక్కనే వున్న గడ్డివామికి నిప్పు...వెంటనే మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తుండగా మరొకటికి నిప్పు ఇలా కాలిబూడిదయ్యాక మరొసటి రోజున ఇదే తంతు...దీంతో రైతన్నలు దిక్కుతోచని స్థితిలో వున్నారు...బాధిత రైతుల కథనం మేరకు... మండలంలోని పెద్దయల్లకుంట్ల, కాగతి పంచాయతీల చిన్నఓబనంపల్లి, గుట్టకిందపల్లిలకు చెందిన రైతులు మనుకూరమ్మగుట్ట సమీపంలోని వ్యవసాయ పొలాల్లో నివశిస్తూ వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకొంటున్నారు. ఈక్రమంలో గత 10రోజులుగా ఆయా ప్రాంతాల్లో నివాసులున్న రైతులకు చెందిన గడ్డివాములు ఒక్కొక్కటిగా కాలి బూడిదవుతున్నాయి. వేమన్న, రమేష్, కృష్ణమూర్తి, నరసింహులు, మల్లికార్జున, రమేష్, శ్రీనివాసులులకు చెందిన గడ్డివాములు, టమోటా



కట్టె కాలి బూడిదయ్యాయి. అందరి రైతులకు సంబంధించి దాదాపు రూ. 3లక్షల వరకు అగ్నిలో కాలిబూడిదైందని రైతులు వాపోయారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా కాల్చుతున్నారా...లేక ఏ విధంగా నిప్పంటుకొంటోందన్న సందిగ్ధ పరిస్థితుల్లో రైతులున్నారు. వ్యవసాయం జూదంలా మారుతున్న ప్రస్తుత సమయంలో పాడిపరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నామనీ, రోజుకొక గడ్డివామిని కాల్చివేస్తున్నారని వారన్నారు. ఈమేరకు స్థానిక పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు. సంబంధిత అధికారులు రహస్యాన్ని ఛేధించాలని స్థానికులు కోరుతున్నారు.

# తిరుమలలో
# మీనాక్షిచౌదరి



తిరుమల,ఏప్రిల్ 13 ప్రభాతవార్తప్రతినిధి:
సినీనటి మీనాక్షిచౌదరి అనుచరులతో కలసి ఆదివారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపలకు వచ్చిన ఆమెను అభిమానులు చుట్టుముట్టి సెల్ఫీలకోసం ఎగబడ్డారు.

# రూ.5 వేల కోట్లతో శాశ్వత మంచినీటి పథకం

- తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రజల శాశ్వత మంచినీటి సమస్య పరిష్కరించడానికి జలజీవన్ కార్యక్రమం ద్వారా 5 వేల కోట్ల రూపాయలతో పనులు చేపట్టనున్నట్లు తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండలంలోని తుంబకుప్పం, ఈచనేరుపల్లి, తుంబపాళ్యం గ్రామాల్లో జనసేన పార్టీ జెండాలను ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులుతో పాటు చిత్తూరు ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి ద్వారా స్వచ్ఛమైన నీరు అందించడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా వుండాలనే లక్ష్యంతో స్వచ్ఛ మైన మంచినీరు అందించడానికి కూటమి ప్రభుత్వం జల జీవన్ పథకం చేపట్టిందన్నారు. జనసేన జిల్లా పార్టీ అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా తాను కొనసాగుతున్నానని, పార్టీ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోందన్నారు. తుంబపాళ్యంలో న్యాయవాది బుస్సా రాజేంద్ర, ఈచనేరిపల్లిలో మాజీ ఎంపిటిసీ శివరాజు, తుంబకుప్పంలో ఆవుల శాంతమూర్తిల ఆధ్వర్యంలో జనసేన పార్టీల జెండాలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు కోడి చంద్రయ్య, జనసేన నాయకులు తోట వేణుగోపాల్, పూలచందు, బాలచంద్ర, బాలు, కిషోర్, కుమార్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# యోగా సాధనతో
# చిత్తం అదుపు.. సంపూర్ణారోగ్యం

## విద్యాస్వరూపానందగిరి స్వామి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



యోగా సాధనతో మన చిత్తంను అదుపులో పెట్టుకోవచ్చునని తద్వారా రోగాలకు దూరంగా ఆరోగ్యవంతంగా జీవితం గడపవచ్చునని ఆశ్రమ నిర్వాహకులు విద్యాస్వరూపానందగిరి స్వామి అన్నారు. ఆశ్రమంలో జరుగుతున్న వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారంసద్గురు సేవా ట్రస్టు కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి ఏటా ఆశ్రమంలో ఐదు రోజుల పాటు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించటం ఆనవాయితిగా వస్తుందన్నారు. విద్యాస్వరూపానందగిరి స్వామి అధ్యక్షతన జరిగిన యోగా దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ ఆశ్రమ వ్యవస్థాపకులు గీతా మకరంద కర్త విద్యా ప్రకాశానందగిరి స్వామి ఎన్నో మహోన్నతాశయాలతో ఏర్పాటు చేసారన్నారు. విద్యతో పాటు వైద్యానికి మహిళా విద్యతో పాటు ఆరోగ్య సూత్రాలను పాటించుటకు ప్రణాళికలు రూపొందించి అమలు చేసారన్నారు. ఇందులో భాగంగానే మనిషి ఆరోగ్యంగా బతకటానికి యోగా సాధన ఎతో అవసరమని శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగసాధనతో మనస్సును ఆదుపులో ఉంచుకొని సంపూర్ణారోగ్యం పొందవచ్చునన్నారు. మందులతో పని లేకుండా మన ఆరోగ్యాన్ని కాపాడుకొనుటకు ఏకాగ్రతతో కూడుకున్న యోగ విద్య ఎంతో ప్రయోజనకరమన్నారు. ఆది కాలం నుంచి ఆశ్రమాల్లో యోగ సాధన చేసే వారని దానితో వారి జీవిత కాలం వందల సంవత్సరాలు ఉండేవన్నారు.మితాహారంతో పాటు శాఖారంతో ఎంతో ఆరోగ్యవంతులుగా ఉండేవారని వివరించారు.ఆశ్రమంలో కొన్ని సంవత్సరాలుగా యోగశిక్షణను అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 1679 మంది ఇక్కడ శిక్షణ పొందారని తెలిపారు.యోగా మాస్టర్ మార్కండేయులు మాట్లాడుతూ ఆశ్రమం సారధ్యంలో ఏడాది పొడవునా ప్రతి రోజూ ఉదయం సాయంత్రం ఉచిత యోగా శిక్షణ ఇచ్చామన్నారు. ఇందుకు స్వరూపానందగిరి స్వామి ప్రోత్సహం అందించారన్నారు. యోగాసానాలు ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందుతున్నారన్నారు. యోగా శిక్షణ పొందిన మోహన్ మాట్లాడుతూఆశ్రమం సారధ్యంలో ఎందరికో ఉచిత శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు.ఈ సందర్భంగా శిక్షణ పొందిన వారికి సర్టిఫికేట్లను అందించారు.ఈ సభలో సభలో పలు ఆశ్రమాలకు సంబంధించి పీఠాధిపతులు స్వస్వరూపానందగిరి స్వామి, విష్ణుసేవానందగిరి స్వామి శ్రీహరి తీర్థ స్వామి., శివానందగిరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# బంగారుతాపడం నిధులు ఏమయ్యాయో!?

-బేడిఆంజనేయస్వామి మూలమూర్తికి వెండిఅలంకరణలతోనే సరి!!



తిరుమల, ఏప్రిల్ 13 ప్రభాతవార్తప్రతినిధి:
మూడేళ్ళక్రిందట అప్పటి అధికారంలో ఉన్న టిటిడి పాలకమండలి ఆమోదించిన బంగారుతాపడం ప్రతిపాదనలకు నేటికీ మోక్షం కలగలేదు. ఆ ఆమోదం అమలుకాకపోగా ఆ వైదిక కార్యక్రమం కోసం విడుదలైన నిధులు ఏమయ్యాయో?అనేది ఇప్పుడు టిటిడి అర్చకుల్లో చర్చ మొదలైంది. ప్రస్తుతం వెండి తాపడాలతోనే బేడి ఆంజనేయ స్వామి భక్తులకు దర్శనమిస్తుండటం విశేషం. కలియుగవైకుంఠం తిరుమలకొండపై కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా బేడిఆంజనేయస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయానికి ప్రత్యేకత కూడా లేకపోలేదు. సాక్షాత్తు స్వామివారి ప్రియభక్తుడుగా పూజలందుకుంటున్నాడు. ఇక్కడ బేడి ఆంజనేయస్వామి మూలవిరాట్టుకు బంగారుతాపడం చేసేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం 2002 జులైలో నిర్ణయించింది. ఇందుకు అవసరమైన సుమారు 18.75లక్షలు రూపాయలు నిధులను మంజూరుచేస్తూ అప్పటి పాలకమండలి ఆమోదించింది. ఈ పనులు అదే ఏడాది సెప్టెంబర్‌లో వెంకన్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు మొదలయ్యేనాటికి పూర్తిచేసే దిశగా టిటిడి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయినా ఈ పనులు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం బేడిఆంజనేయస్వామికి వెండితోతయారుచేయబడిన కవచాలును అమర్చిఉన్నారు. వీటిపై బంగారుతాపడం చేయాలని భక్తుల కోరిక మేరకు టిటిడి ఈ పనులు మొదలుపెట్టాలని, ఇందుకు దాతల సహకారం కూడా తీసుకోవాలని నిర్ణయించారు. అయితే గత మూడేళ్ళుగా ఇవేమీ అమలు కాలేదు. తిరుమలలో ఏదేని ఆలయ శుభకార్యాలు, పట్టువస్త్రాలు సమర్పణ, మఠాధిపతులు, పీఠాధిపతులు పెద్దమర్యాద సమయాల్లో, బ్రహ్మోత్సవాల్లో గొడుగులు సమర్పణకు ముందు వాటిని తొలుత బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్దకు తీసుకువచ్చి ఇక్కడ ఉంచి ప్రత్యేక పూజలు చేయడం సంప్రదాయం. దీంతో బేడి ఆంజనేయస్వామికి మరింత విశిష్టత సంతరించుకుంది. ఇక్కడ స్వామివారికి బంగారు తాపడం చేయాలనేది భక్తుల అభిప్రాయాలు మాత్రం కాగితాలపైనే ఉండిపోయింది. అంతేగాక తిరుమల ఆలయంలో మూలవిరాట్టు శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైఉన్న బంగారువాకిలిని కూడా స్వర్ణమయం చేయాలని సంకల్పం నెరవేరడం లేదు.

# టిటిడిపై అసత్య ప్రచారాలు మానుకోవాలి

## - ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



సూళ్లూరుపేట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

హిందూ ధార్మిక సంస్థ అయిన టిటిడిపై అసత్య ప్రచారం చేయడం మానుకోవాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ హితవు పలికారు. ఆదివారం ఆమె తన క్యాంప్ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి టిటిడి గోశాలలో ఆవులు చనిపోయాయని గోబెల్ ప్రచారం చేస్తున్నారన్నారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో పనిచేసి ప్రస్తుతం మాజీగా ఉన్న ఆయన ఇటువంటి నిరాధార ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. హిందూ ధార్మిక సంస్థ టిటిడిలో భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. రాజకీయాలను ఇటువంటి ధార్మిక సంస్థలు చొప్పించడం సరికాదన్నారు. టిటిడిని ప్రక్షాళన చేసే దిశగా కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందన్నారు. గతంలో ఐదేళ్ల పాటు టిటిడిలో ఉన్న పెద్దలు తిరుమలను భ్రష్టు పట్టించారని, ఇప్పుడిప్పుడే పూర్వ వైభవం సంతరించుకుంటున్న టిటిడిపై ఇటువంటి ప్రచారాలు చేయడం మాని బాధ్యతాయుతంగా సహకరిస్తే మంచి ఫలితాలు రావడంతో పాటు భక్తులకు సరయిన న్యాయం చేయగలుగుతామని నెలవల విజయశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, కొండలరావు, కె.శ్రీధర్, బిజెపి నేతలు ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా పునుగోటి విశ్వనాథం



వెంకటగిరి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త

వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్గా మాజీ కౌన్సిలర్ పునుగోటి విశ్వనాథం (మురుగ)ను పదవి వరించనుంది. మురుగ పేరు దాదాపుగా ఖరార్ అయింది. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ విశ్వనాథం పేరును ప్రభుత్వానికి పంపారు. ఒకటి రెండు రోజుల్లో ఏఎంసీ ఛైర్మన్గా విశ్వనాథం పేరు రానుంది. విశ్వనాథం మాజీ కౌన్సిలర్‌గా, టిడిపి భాగం జిల్లా కార్యదర్శిగా కూడా పని చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో ఆయన చురుగ్గా పాల్గొంటున్నారు.

## పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణారెడ్డి



కోట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

వైసీపీ ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ ప్రధాన కార్యదర్శిగా పాదర్తి రాధాకృష్ణారెడ్డిని ఆ పార్టీ అధిష్టానం నియమించింది. తనకు అప్పగించిన ఈ బాధ్యతను శక్తివంచన లేకుండా నిర్వర్తిస్తానని ఈ సందర్భంగా పాదర్తి రాధాకృష్ణారెడ్డి చెప్పారు. తనకు ఈ పదవి రావడంలో కృషి చేసిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర వైసీపీ కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి, ఎంఎల్‌సి మేరిగ మురళీధర్‌కు రాధాకృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## ఐఐటి ఫౌండేషన్ ఒలింపియాడ్ పరీక్షల్లో శ్రీప్రగతి విద్యార్థుల ప్రతిభ




కోట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

ఈ-అభ్యాస్ అకాడమి హైదరాబాద్ వారి ఆధ్వర్యం లో నిర్వహించిన వివిధ రాష్ట్రస్థాయి ఒలింపియాడ్ పరీక్షల్లో శ్రీ ప్రగతి విద్యానికేతన్ స్కూలు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించి సత్తా చాటారు. వీరికి ఆదివారం గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన అభ్యాస్ ఉత్సవ్ అవార్డు ఫంక్షన్‌లో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సరిత, ఇస్రో శాస్త్రవేత్త గోపీకృష్ణ, అడిషనల్ ఎస్పీ హనుమంతు తదితరుల చేతుల మీదుగా మెమొంటోలు బహూకరించారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఒలింపియాడ్‌లో సాధించిన రాష్ట్ర ర్యాంకుల వివరాలు, రామన్ సైన్స్ మహోత్సవ్‌లో నిహాల్ మనోహర్ ఫస్ట్ ర్యాంక్,ఆర్షియా థర్డ్ ర్యాంక్, కలాం సైన్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో యశ్విన్,తేజ ఆర్షియా థర్డ్ ర్యాంక్, ఠాగూర్ ఇంగ్లీష్ ఆప్టిట్యూడ్ టెస్ట్ నిహాల్‌మనోహర్ ఫస్ట్ ర్యాంక్, యశ్విన్ సెకండ్ ర్యాంక్, కల్పనా చావ్లా మహోత్సవాల్లో లలిత ఫస్ట్ ర్యాంక్, మోహిత్ థర్డ్ ర్యాంక్, అపస్మా సైన్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో అశ్విని ఫస్ట్ ర్యాంక్, రామానుజన్ మ్యాథ్స్ మహోత్సవ్‌లో హరికుషల్ ఫస్ట్ ర్యాంక్, నిహాల్ మనోహర్ సెకండ్ ర్యాంక్, చాణక్య బిజినెస్ ఆప్టిట్యూట్ టెస్ట్‌లో శ్రీహర్ష సెకండ్ ర్యాంక్, భరత్, ఆమన్ ఆలిం థర్డ్ ర్యాంక్, ఆర్యభట్ట మ్యాథ్స్ ఆప్టిట్యూట్ టెస్ట్‌లో నిహాల్ మనోహర్, హర్షిణి సెకండ్ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల ఛైర్మన్ పసుపులేటి కిషోర్ విద్యార్థులను అభినందించారు. భవిష్యత్‌లో విద్యార్థులు ఐఐటి, నిట్ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించే విధంగా ఫైండేషన్ క్లాసులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇన్ని ర్యాంకులు సాధించడం విద్యాసంస్థలకే గర్వకారణమని ఈ సందర్భంగా ఉపాధ్యాయులను, ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను ఆయన అభినందించారు.

## కరుణాకర్‌రెడ్డికి గోవుల గురించి విమర్శించే అర్హత లేదు

### - ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



వెంకటగిరి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త

మాజీ టిటిడి బోర్డు ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి నాస్తికుడని ఆయనకు దైవభక్తి అన్న, గోపూజన్న ఇష్టం ఉండదని ఆయన గోవుల మృతి చెందుతున్నట్లు ఆరోపణ చేస్తుండడం విచిత్రంగా ఉందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోనే ఎమ్మెల్యే నివాస గృహంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. గోశాలలో గోవులను టీటీడీ వారు సొంత బిడ్డల వలె చూసుకుంటున్నట్లు తెలిపారు. వయసు అయిపోయినట్టే మృతి చెందుతూ ఉంటాయని దాన్ని రాజకీయం చేయడం మంచిది కాదన్నారు. కరుణాకర్ రెడ్డి టీటీడీ బోర్డు ఛైర్మన్ గా ఉండగా టిడిపి నాశనం చేశారని విమర్శించారు. కరుణాకర్ రెడ్డి హిందూ ధర్మం అంటే ఆయనకు పడదు అన్నారు. గోశాలలో గోవులన్నీ ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. ఎలాంటి ఆరోపణ మానుకోవాలని హితవు చెప్పారు. సమావేశంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ రాజేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోటేశ్వర్ రెడ్డి, రాయ్ మస్తాన్ నాయుడు, నాయకులు సత్యనారాయణ, రాజేశ్వరరావు, విశ్వనాథం, ఆనంద్జన సేన నాయకులు జంపాల ప్రకాష్, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సహాయం అందిస్తున్న రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్



చిల్లకూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త

చిల్లకూరు మండలం ఆపద అంటే నేనున్నాను అంటూ పేద ప్రజలకు సహాయం అందించడంలో రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ముందుంటుందని ఉన్నపువారిపాలెం పంచాయతీ కార్యదర్శి ఎస్.కె జమీర్ భాష తెలియజేశారు. చిల్లకూరు మండలం పున్నపువారిపాలెంలోని అరుంధతివాడకు చెందిన సూళ్లూరు వెంకటరామ్ అనే వికలాంగుని రేకుల ఇల్లు ఈనెల తొమ్మిదవ తేదీ రాత్రి ఏర్పడిన గాలి, వానకు ఇంటి పక్కనే ఉన్న వృక్షం వారి ఇంటిపై పడడంతో గృహం పూర్తిగా దెబ్బతింది. భార్యాభర్తలు ఇద్దరూ వికలాంగులు కావడంతో వారి సామాగ్రి అన్ని బయట పెట్టుకుని ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధినేత రాజనేని శ్రీనివాసులు నాయుడు ఉన్నపువారిపాలెం గ్రామాలకు వెళ్లి బాధితులను పరామర్శించి,తక్షణ సహాయంగా ఇంటి నిర్మాణం కోసం 20వేల రూపాయలను వారికి అందజేశారు.

## వైసిపి హయాంలోనే తితిదే ప్రతిష్ట దిగజార్చారు

### ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్



గూడూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త

వైసిపి హయాంలోనే తితిదే ప్రతిష్ట పూర్తిగా దిగజార్చారని, టిటిడి మాజీ ఛైర్మన్ కరుణాకర్ రెడ్డి అసత్య వాక్యలను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఖండించారు. ఆదివారం క్యాంప్ కార్యాలయం నందు నాయకులతో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో తితిదే ప్రతిష్ఠను పూర్తిగా దిగజార్చి నేడు సస్పెండ్ అయిన హరినాథరెడ్డి అనే అధికారి కోసం కరుణాకర్ రెడ్డి అస త్యాలు ప్రచారం చేస్తున్నారు. ఎక్కడో చనిపోయిన ఆవుల ఫొటోలు చూపిస్తూ ప్రజలను తప్పు దారి పట్టిస్తున్నారని తెలిపారు. తితిదే గోశాలను 266 మందికి పైగా సిబ్బంది పర్యవేక్షిస్తూ జియో ట్యాగింగ్‌తో ఆవులను సంరక్షిస్తున్నారని, గతంలో కంటే మెరుగ్గా ఇప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. కరోనా సమయంలో శ్రీవారి లడ్డూలను దారి మళ్లించారు. తిరుమల బస్సు టికెట్లపై అన్యమతానికి సంబంధించిన చిహ్నాల్ని ముద్రించేలా చేశారు. కల్తీ నెయ్యితో శ్రీవారి ప్రసాదం పవిత్రతను మంటగలిపారు. ఇవన్నీ వాస్తవాలు కావా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టిపిటి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## కాపు బలిజ సంక్షేమ సంఘం ద్వారా విరివిగా సేవా కార్యక్రమాలు

### - ట్రస్ట్ ఛైర్మన్ తోట కృష్ణయ్య



వెంకటగిరి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త

శ్రీకృష్ణదేవరాయ బలిజ కాపు తెలగ ట్రస్ట్ ద్వారా విరివిగా సేవా కార్యక్రమాలు చేస్తామని ట్రస్ట్ ఛైర్మన్ తోట కృష్ణయ్య తెలిపారు. పట్టణంలో మజ్జిగ చలివేంద్ర కార్యక్రమం ప్రారంభించబడినది. ఎండా కాలం మొత్తం పలు ప్రాంతాల్లో ప్రతి ఆదివారం ఈ మజ్జిగ చలివేంద్ర కార్యక్రమం ట్రస్టు ద్వారా నిర్వహిస్తామని ఆయన ఇంకా విరివిగా సేవా కార్యక్రమాలు చేస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమానికి స్థానిక అడ్వకేట్ మురళీకృష్ణ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కోనా వెంకటేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, వి మధుసూదన్ రావు,పి విశ్వనాథం, తిరుపాల్, గొల్లగుంట రాము,వెంకట ముని, ఫకీర్ గారి ఆనందు, తులసిదాసు ,పసుపులేటి విజయ్ నాగరాజా, స్వామి రవీంద్ర దేగల రేవతి అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా కంటి వైద్య శిబిరం



వెంకటగిరి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త

వెంకటగిరి పాలకేంద్రం దగ్గర కుమ్మరగుంటలో శ్రీ షిరిడి సాయి బాబా ఆశ్రమం నందు సుశీల నేత్రాలయం వారిచే జరిగిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నందు డక్కిలి, బాలాయ పల్లి, వెంకటగిరి రూరల్ మండ లం, వెంకటగిరి మున్సిపాలిటి నుంచి 255 మంది అవుట్ పేషెంట్ల హాజరైయ్యారు. వారిలో 108 మంది పేషెంట్లు శుక్లం ఆపరేషన్‌కు గుర్తించి వారికి ఆపరేషన్ నిమిత్తం, అసుపత్రిలో వారి ద్వారా వాహనములులో నెల్లూరుకు తీసుకొని వెళ్ళారు. ఈ కార్యక్రమంకు డాక్టర్ పి. సుధాకర్ రావు, డాక్టరు అపర్ణ వారి సిబ్బంది హాజరై కంటి పరీక్షలు నిర్వహించారు.

## మత్తుమందు ఇచ్చి బంగారు ఆభరణాలు చోరీ

కోట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

మండల కేంద్రమైన కోటలోని ఎన్‌సిఆర్ నగర్‌లో ప్రమీల అనే మహిళకు నెల్లూరుకు చెందిన సంపత్ అనే వ్యక్తి వైద్యం పేరుతో మత్తు ఇంజక్షన్ ఇచ్చి చేతులకు ఉన్న ఆరు సవర్ల బంగారు గాజులను అపహరించాడు. బాధితురాలు ఆదివారం కోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ నెల 10న నెల్లూరు నుంచి సంపత్ షుగర్ పరీక్ష నిమిత్తం ప్రమీల ఇంటికి వచ్చాడు. ఆ క్రమంలో ఆమెకు మత్తు ఇంజక్షన్ ఇవ్వడంతో స్పృహ తప్పి పడిపోయింది. చేతులకు ఉన్న గాజులు లేకపోవడంతో బాధితురాలు పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించింది. ఎస్ఐ పవన్‌కుమార్ విచారణ జరుపుతున్నారు.

## మే 3న ముస్లిం పిల్లలకు ఉచిత ఖత్న కార్యక్రమం



గూడూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త

మే నెల 3వ తేదీ గూడూరు సాది మంజిల్‌లో మహమ్మదీయాన్ వెల్ఫేర్ నెట్వర్క్ ఆధ్వర్యంలో ప్రముఖ కోవూరు డాక్టర్ షేక్ మహబూబ్ బాషాచే ముస్లిం పిల్లలకు ఉచిత ఖత్న కార్యక్రమం నిర్వహించబడుతుందని నెట్వర్క్ గౌరవ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ తెలియజేశారు. గూడూరు దర్గా ఆవరణలో జరిగిన నెట్వర్క్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖత్న చేయించుకున్న పిల్లలకు పౌష్టికాహారం, లలిత మెడికల్స్ యూసఫ్ హుస్సేన్‌చే ఉచితముగా మందులు ఇవ్వబడునని తెలిపారు. అదేవిధంగా సోమవారం నెల్లూరులో జరిగే వక్ఫ్ చట్టం రద్దు పరచాలని జరిగే నిరసన కార్యక్రమంలో గూడూరు నుండి ముస్లిం సోదరులు భారీగా తరల వెళ్లాలని నెట్వర్క్, దర్గా వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పిలుపునివ్వడమైనది. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్, దర్గా కమిటీ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్, నియోజకవర్గ ముతవల్లి కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రహీం, లలిత మెడికల్స్ యూసుఫ్ హుస్సేన్, నెట్వర్క్ సభ్యులు మొహమ్మద్ రావుఫ్, అప్సర కరీముల్లా, గోల్డ్ నాజర్, షేక్ యస్ దాని భాష, తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ప్రవేశ పరీక్షలు

కోట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

కోటలోని అంబేద్కర్ గురుకులంలో వివిధ ప్రవేశాలకు ఆదివారం ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 130 మందికి గాను 110 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్మీడియట్ ప్రవేశానికి 141 మందికి గాను 120 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఎవిఎల్ వెంకటేశ్వరరావు తెలిపారు.

## కాణిపాకంలో వైభవంగా పంగుని పౌర్ణమి గ్రామోత్సవం



కాణిపాకం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:

పంగుణి పౌర్ణమి సందర్భంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారికి గ్రామోత్సవంను అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆలయంలో పంగుణి పౌర్ణమి సందర్భంగా స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈకార్యక్రమానికి దేవస్థానం విశ్రాంత ప్రధాన అర్చకులు దివంగత చంద్రమౌళి గురుకుల్ కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఉభయదారులు వరుస ఉభయం తీసుకురాగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సిద్ది బుద్ది సమేత ఉత్సవమూర్తులను అలంకర మండపంలో వుంచి అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించిన ప్రత్యేక పల్లకిపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పెంచల కిషోర్, సూపరెండెంట్ వాసు, ఉత్సవ ఉభయదారులు ఆలయ ఉప ప్రధాన అర్చకులు గణేష్‌గురుకుల్, రాఘవేంద్ర గురుకుల్, బాలుసుబ్రమ్యంలతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి క్షీరాభిషేకం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఆది వారం రాత్రి శ్రీకాళహస్తిలోని ఆర్టీసి కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహాలను శుభ్రపరచి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం దీపాలు వెలిగించి రాజ్యాంగ నిర్మాతకు నివాళులు అర్పించారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ స్ఫూర్తితోనే బిజెపి పనిచేస్తోందన్నారు. అంబేద్కర్ ఆశయసాధనకు మనమంతా కృషిచేసినపుడే నిజమైన నివాళులు అర్పించినట్లు అవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ని గుర్తించిన దాఖలాలు లేవని ఆయన అభివృద్ధికి అడుగడుగున అడ్డుపడుతూ ఆయన మృతికి కాంగ్రెస్ ప్రభుత్వం కారణమైందన్నారు. బిజెపి ప్రభుత్వంలో అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలతో ప్రజలకు సుపరిపాలన అందజేస్తుందన్నారు.

## ఆయనకు మంచి బుద్దిని ప్రసాదించుస్వామీ

### -అలిపిరిలో టిడిపి నేతల గోపూజలు



తిరుమల,ఏప్రిల్ 13ప్రభాతవార్తప్రతినిధి:

దేవుడితో రాజకీయాలు చేస్తున్న గత ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డికి మంచి బుద్దిని ప్రసాదించాలని టిడిపి నాయకులు వేడుకున్నారు. ఎస్వీగోశాలలో గోవులు మరణించాయని అసత్య ప్రచారంచేసిన దాన్ని నిరసిస్తూ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, బుల్లెట్ రమణ, మధుబాబు, రఫీ, ఐఎస్ ఖాజా, లక్ష్మీ, ప్రమోద్‌తో కలసి అలిపిరి పాదాల మండపం వద్దవున్న గోశాలలో గోవులకు పూజలు చేసి నమస్కరించారు.

## కళాకారులకు జాతీయ బెస్ట్ సింగర్ అవార్డు ప్రదానం



తిరుపతి హెల్త్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :

తిరుపతి జిల్లాలోని శ్రీ కాళహస్తి ఉషోదయ పౌండేషన్ ఆధ్వర్యంలో నిరోష సరిగమలు కార్యక్రమంకు ప్రముఖ రచయిత్రి డాక్టర్ ధనాశి ఉషారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్గనైజర్ నిరోష, కో ఆర్గనైజర్ డాక్టర్ ధనాశి ఉషారాణి, మరో కో ఆర్గనైజర్ ఆజాద్ నిర్వహణలో వివిధ జిల్లాలకు చెందిన సినీ విభావరి కార్యక్రమం శ్రీ కాళహస్తి శ్రీరామ్ నగర్ కాలనీ లోటరీ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష అభివృద్ధికి మానసిక ప్రశాంతతకు నృత్యంతో కూడిన పాటలతో అందరిని చక్కగా అలరించించదని గాయకులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే వివిధ రాష్ట్రాల నుంచి గాయనీ గాయకులు పాల్గొని వారి ప్రతిభను కనబరచినందుకు వంద మంది గాయకులకు జాతీయ బెస్ట్ సింగర్ అవార్డుతో ప్రముఖ సింగర్ డాక్టర్ ధనాశి ఉషారాణి అందరిని శాలువ,పుష్ప గుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్ర, జిల్లాల నుంచి గాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీవారి దర్శనార్థం రేణిగుంట చేరుకున్న పవన్ కళ్యాణ్ సతీమణి..



రేణిగుంట ఏప్రిల్ 13 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా లెజినోవా శ్రీవారి దర్శనార్థం వెళుతూ ఆదివారం రేణిగుంట (తిరుపతి) అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్నారు. సింగపూర్ లో జరిగిన అగ్ని ప్రమాదం నుండి కుమారుడు మార్క్ శంకర్ సురక్షితంగా బయటపడడంతో శ్రీవారిని దర్శించుకోవడానికి తిరుమల వెళుతూ రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా సాదాసీదాగా ఆమె రోడ్డు మార్గంలో శ్రీవారిని దర్శించుకోవడానికి తిరుమల బయలుదేరి వెళ్లారు.

# చారిత్రాత్మక చంద్రగిరిలో "మహా ప్రస్థానం"





చంద్రగిరి-ప్రభాతవార్త:

నీ జీవన ప్రజాసేవ ప్రయాణంలో నువ్వు చేసిన కర్మ చంద్రగిరి ప్రజల మనస్సుల్లో నిత్య స్మరణకు దోహదపడగలదని ఎంఎల్ఏ పులివర్తి నాని పట్ల సర్వత్రా అభినందనలు వ్యక్తమవుతున్నాయి. చారిత్రాత్మక చంద్రగిరి నియోజకవర్గ కేంద్రంలో "మహాప్రస్థానం" నిర్మాణం పులివర్తి కిరీటంలో కలికితురాయి కాగలదని ప్రజలు ముక్తకంఠంతో ప్రశంసిస్తున్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయడం ద్వారా తన ఉనికిని చాటుకోవాలనే ఆశలు అందరికీ వుండవచ్చు గాక కానీ ఆ మేరకు జనం మదిలో శాశ్వతంగా నిలిచిపోయే కార్యక్రమాలు చేయడం కొంత మందికే సాధ్యపడగలదని ఎంఎల్ఏ నిరూపించారు. చంద్రగిరి గ్రామ పంచాయతీలో ప్రజల దాహార్తిని తీర్చిన ఘనత ఒకప్పటి పంచాయతీ సర్పంచ్ దుబాసి రామ్మూర్తిని ఇప్పటికీ గొప్పగా చెప్పుకుంటున్నారు. రాయలవారి కాలం నుండి శతాబ్దాలుగా సరైన శ్మశాన వాటిక లేక పవిత్రమైన స్వర్ణముఖీ నదిని అపవిత్రం చేస్తూ శవాలను పూడ్చి పెట్టడం, పరిసర పంచాయతీల నుండి చెత్తను తీసుకెళ్ళి ఇదే స్వర్ణముఖీ నదిలో కుప్పలు తెప్పలుగా పోయడం, ఇది చాలదన్నట్లు ఎక్కడెక్కడో నుండి కోళ్ళ వ్యర్థాలను తీసుకువచ్చి ఇదే స్వర్ణముఖీ నదిలో కుమ్మరిస్తున్నారు. దీంతో వర్షాకాలం ఎవరైనా కాలం చేస్తే ఆ మృతదేహాన్ని తరలించడం ఎంత కష్టమో టిడిపి నాయకులు దివంగత గంగపల్లి భాస్కర్, బన్నీ అంత్యక్రియల్లో కళ్ళారా చూడటమే కాకుండా తాను పడిన ఇబ్బందులు ఇకపై ఎవ్వరూ పడకూడదని నిర్ణయించుకున్న పులివర్తి చరిత్రలో ఒక మంచి నిర్ణయం తీసుకునేందుకు దోహదపడింది. తిరుపతి నగరంలో నెలకొల్పిన గోవిందధామం తరహాలో మహాప్రస్థానం పేరిట చంద్రగిరిలో నిర్మించతలపెట్టారు. ఎంఎల్ఏ ప్రత్యేక చొరవ కారణంగా మహాప్రస్థానం కొరకు రెడ్డివారిపల్లికి రామచంద్రారెడ్డి తనకున్న 2 ఎకరాలు వ్యవసాయ భూమిని విరాళంగా ప్రకటించారు. పెద్ద మనస్సుతో భూ విరాళానికి ముందుకు వచ్చిన రైతుకు తప్పక న్యాయం చేస్తానని ఎంఎల్ఏ ప్రకటించారు. తహశీల్దార్ శివరామసుబ్బయ్య, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ సహకారం అందిపుచ్చుకున్న ఎంఎల్ఏ గత వారం వారిని వెంటబెట్టుకుని మహాప్రస్థానం నిర్మాణానికి భూమిపూజ చేశారు. మహాప్రస్థానం నిర్మాణానికి రూ.5 నుండి 6 కోట్ల వరకు వ్యయం కాగదలని అంచనా వున్నప్పటికీ వెనకడుగు వేయకుండా ముందుకు సాగుతున్నారు. ఇందుకు మద్దతుగా దాతలు భూమిపూజ రోజున దాదాపు రూ.25 లక్షలు తమ విరాళాలను ప్రకటించారు. ఏదో భూమిపూజ చేసేశాం ఇక చూద్దాంలే చేద్దాంలే అనుకోకుండా పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతూ ముందుకు సాగుతున్న ఎంఎల్ఏకి నియోజకవర్గ ప్రజలు తమ కుటుంబం నుండి ఎంతో కొంత ఇతోధిక సహకారాన్ని అందించడం ద్వారా మహాప్రస్థానం నిర్మాణాన్ని పూర్తి చేయడం తప్పనిసరిగా భావించాల్సివున్నది. ఇందుకు మహాప్రస్థానం కమిటీ సైతం తమవంతు బాధ్యతలను ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ముందుకు సాగాల్సివుంది.

# స్వేచ్ఛా జీవనాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్

తిరుపతి విద్య ఏప్రిల్ 13 ప్రభాత వార్త



భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా జాతీయ సంస్కృత వర్సిటీలో అంబేద్కర్ దార్శనికత, సమకాలీన రాజ్యాంగ అవగాహన, సామాజిక న్యాయం అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును ఆయన ఆదివారం ప్రారంభించారు. అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్కృతాన్ని జాతీయ భాషగా అభివృద్ధి చేయాలన్న ఆయన పట్టుదల అభినందనీయమన్నారు. యువత ఆయన అడుగుజాడలలో నడుస్తూ, ఆశయ సాధనకు కృషి చేయాలని పిలిపునిచ్చారు. అనంతరం అడిషనల్ కోఆర్డినేటర్ రిజర్వేషన్ సెల్ ఛైర్పర్సన్, ఈసీ మెంబర్, వర్సిటీ కోర్టు సభ్యులు, డాక్టర్ జెబీ చక్రవర్తి మాట్లాడుతూ అంబేద్కర్ కలలు కన్న భారతావనికోసం, ఆయన ఆశయసాధనకోసం ప్రతి పౌరుడు అవిశ్రాంత కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీన్ రజనీకాంత్ శుక్లా, ప్రొఫెసర్ రాధాగోవింద త్రిపాఠి, ప్రొఫెసర్ పి వెంకట్రావు, ప్రొఫెసర్ సత్యనారాయణ, డాక్టర్‌చందూలాల్, డాక్టర్ నల్లన్న, వై. విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డాక్టరేట్ గౌరవం అందుకున్న మల్లీశ్వరి

పుత్తూరు రూరల్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



పుత్తూరులో ప్రతి ఆదివారం జరిగే సత్సంగంలో వృత్తి పరంగా టీచర్‌గా పని చేసే అనేక ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న ఆర్. మల్లీశ్వరిని వారి సేవలు గుర్తించి యునైటెడ్ నేషన్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ పుదుచేరి వారిచే గౌరవ డాక్టరేట్ అందుకోవడం గర్వకారణమని తెలిపారు. వారు మాట్లాడుతూ మానవుడు కేవలం తిండి, నిద్ర, బట్ట కోసమే జీవితాన్ని పణంగా పెట్టకుండా పది మందికి ఉపయోగపడే లోక కల్యాణ కార్యక్రమాలను చేపట్టి వాటి అమలు కోసం త్రికరణశుద్ధిగా మన జీవితాన్ని అంకితం చేయడమే మన జీవిత లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో సభ్యులు నాగరాజు, సుబ్రహ్మణ్యం, సుజాత, తిరుమలరాజులను సన్మానించారు.

# అప్నా అధ్యక్షులుగా డాక్టర్ రవిరాజు

పుత్తూరు రూరల్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు ఆస్పత్రి, నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్(అప్నా) నూతన అధ్యక్షులుగా డా. రవిరాజు, కార్యదర్శిగా డా. మారుతికృష్ణ, కోశాధికారిగా డా. దామోధరంలు ఎన్నికయ్యారు. ఈ నూతన కార్యవర్గ పరిచయ కార్యక్రమం తిరుపతి ఎమ్మెల్సీ డా. సిపాయి సుబ్రహ్మణ్యంల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రవిరాజు మాట్లాడుతూ ఆస్పత్రుల అభివృద్ధికి అందుబాటులో ఉంటూ నిరంతరం కృషి చేస్తామన్నారు. ముఖ్య అతిథులు ఆరణి శ్రీనివాసులు సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆస్పత్రులు నిర్వహించే వైద్యుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి వారధులుగా ఉంటూ శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. విజయవంతమైన కేసుల గురించి డాక్టర్లు శ్రీరామరాజు, నరసింహులు పవర్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. డీఎంఅండ్‌హెచ్‌వో డా. బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ ఆస్పత్రుల నిర్వహణకు అవసరమైన అన్ని అనుమతులను సకాలంలో అందించేందుకు తనవంతు సాయం అందిస్తామన్నారు. ఇందుకు వైద్యులు సైతం సహకరించాలన్నారు. అనంతరం డాక్టర్లు శ్రీహరిరావు, శ్రీనివాస్, సుబ్బారెడ్డి, ఆదినారాయణ, జనార్ధన్, రెడ్డెప్ప, ఆర్‌ఆర్ రెడ్డి, మదన్మోహన్, మునిశేఖర్, సురేష్ తదితరులను ఘనంగా శాలువలతో సన్మానించారు.

# పార్టీని నమ్ముకున్న వారికి పదవులు

రిపబ్లిక్ క్లబ్ అధ్యక్షుడుగా బిజె ప్రసాద్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఉమ్మడి ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి కష్టకాలంలో తనతో నడిచిన వారికి పదవులు అందించటంలో చొరవ చూపుతున్నారు. .శ్రీకాళహస్తిలో పార్టీ ఆవిర్భావం నుంచి బొజ్జల కుటుంబానికి తోడుగా నడచిన బిజె ప్రసాద్‌కు అవకాశం ఉన్న శ్రీకాళహస్తి రిపబ్లిక్ పగ్గాలను అందించారు. గతంలో తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శిగా ప్రసాద్ పని చేసారు. అలాగే క్లబ్‌లో కార్యదర్శిగా కూడా పని చేసిన అనుభవం ఉంది. శ్రీకాళహస్తిలో రిపబ్లిక్ క్లబ్‌ను ఈ ప్రాంతాలను పరిపాలించిన రాజులు ఏర్పాటు చేసారు. ఇక్కడి పరిస్థితిపై అవగాహన ఉన్న బిజె ప్రసాద్‌కు ఆ పగ్గాలు ఎంఎల్‌ఏ అందిస్తూ అక్కడ చక్కదిద్దాలను పూర్వ వైభవం తీసుకురావాలని దిశ దెశ నిర్దేశం చేసారు. ఆయనతో పాటు పాలకమండలిని కూడా నామినేట్ చేసారు.

***క్లబ్ నిధులు స్వాహా:***

శ్రీకాళహస్తి రిపబ్లిక్ క్లబ్ పదేళ్ళ క్రితం వరకు ఎంతో సమర్థవంతంగా పని చేసింది. ఈ క్లబ్ తరపున జాతీయ స్థాయిలో టెన్నిస్ పోటీలు నిర్వహించారు. అయితే వైకాపా పాలనలో క్లబ్ పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. క్లబ్‌కు సంబంధించిన లెక్కల్లేదు. లక్షలకు లక్షలు దిగమింగారు. కొందరు ఇదో వ్యాపారంగా మార్చుకున్నారు. క్లబ్‌కు సంబంధించిన గదులను వాడుకుంటున్నారు. కొత్త కార్యవర్గం ఏర్పడితే ఇక తమ ఆటలు సాగవనే భావంతో లొల్లి చేస్తున్నట్లు సమాచారం.

# విద్యుత్ సరఫరాకు అంతరాయం: జనం అతలాకుతలం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని పానగల్‌లో ఆదివారం ఉదయం నుంచి విద్యుత్‌కు అంతరాయం కల్గటంతో ఈ ప్రాంతం లోని విద్యుత్ వినియోగదారులు తల్లడిల్లి పోయారు. శనివారం సాధారణంగా ఉదయం 9గంటలకు నిర్వహణకు విద్యుత్ సరఫరాను ఆపి మధ్యాహ్నం 1 గంటలకు పున: ప్రారంభించే వారు. టెంపుల్ టౌన్ కాబట్టి నాలుగు మాడావీధుల్లో 9గంటలకు ఆపి తిరిగి 11 గంటలకు పున: ప్రారంభించే వారు కానీ ఇటీవల కాలంలో విద్యుత్ శాఖ అధికారులు ఈ నిబంధనలను పాటించటం లేదు. టెంపుల్ టౌన్ అయితే మాకేంటి? వ్యాపారులు, జనం ఇబ్బంది పడితే మాకొచ్చిన నష్టమేమిటనే తీరుతో వ్యవహరిస్తు న్నారు. శనివారం ఉదయం 7గంటలకే విద్యుత్ సరఫరా ను ఆపివేసారు. ఓ వైపు శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి ఇబ్బడిముబ్బడిగా భక్తులు రావటంతో హోటళ్ళలో అల్పాహారం కూడా లభించకఏపోవటంతో వీధుల్లోని తోపుడు బండ్లపై అల్పాహారానికి ఎగబడ్డారు. 9గంటలకు తీయాల్సిన కరెంటును ఉదయం 7గంటలకే తీసివేసినప్పటికి తిరిగి మధ్యాహ్నం 1 గంట తరువాతనే సరఫరా ఇచ్చారు.

***ఎంఎల్‌ఏ మౌనమెందుకు?***

శ్రీకాళహస్తి టెంపుల్ టౌన్ కాబట్టి శనివారాల్లో మెయిన్‌టినెన్సుకు గతంలో శాసనసభ్యుడుగా ఉన్న బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఒప్పుకునే వారు కాదు. అయితే ప్రస్తుత శాసనసభ్యుడు ఆయన తనయుడు సుధీర్‌రెడ్డి ఎందుకో ఎంతసేపూ అభివృద్ధి మంత్రం జపిస్తున్నారు తప్ప ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి పట్టించుకోవటం లేదనే అసంతృప్తి జనంలో చోటు చేసుకుంది. పలు శాఖలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులకు సంబంధించి అర్జీలు తీసుకొనుటకు ప్రజా దర్బార్‌ను ఏర్పాటు చేసారు. మరి అక్కడ వచ్చిన సమస్యలు ఎన్ని పరిష్కారమౌతుంది? అనే దిశగా పరిశీలించాల్సి ఉంది.

కూలిన చెట్టు: విద్యుత్ సరఫరాకు అంతరాయం:

శ్రీకాళహస్తి పానగల్ పరిసరాల్లో ఉదయం నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కారణం పాత ఎడిబిబ్యాంకు పక్కన చెట్టు కూలటంతో విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయి. దాంతో మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా జరగలేదు. దాంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఓ వైపు ఎండలు దడ పుట్టిస్తుంటే విద్యుత్ సరఫరా లేకపోవటంతో తల్లడిల్లి పోయారు.

# అందరికి స్నేహితుడు శివాజి హఠాన్మరణం

పలువురు సంతాపాలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలో అందరికి చిరపరిచయస్తుడు ఆప్యాయంగా పలకరించే మధ్యవయస్కుడు బలిజ నాయకుడు పాపగారి శివాజీరావు ఆదివారం వేకువ జామున హఠాన్మరణం చెందారు. శ్రీకాళహస్తి పట్టణంలో పాపగారి చెంచయ్య కుటుంబానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. రామచంద్రా థియేటర్ ఎదురుగా మిల్లును నడిపిన ఆ కుటుంబబిఆనికి ఎంతో మంచిపేరు ఉంది. తెలుగుదేశం మద్దతుదారులుగా శివాజి కుటుంబం ఉంది. పట్టణంలో ఎవరిని చూసినా ఆప్యాయతగా తెలుగు, ఉర్దు, తమిళ, ఇంగ్లీష్ భాషలో పలకరించే శివాజి ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనే వారు. 1974-76లో ఇంటర్ డిగ్రీ పూర్తి చేసిన ఆయన లాంకోలో చాలా కాలం పిఆర్‌ఓగా పని చేసారు. ఇక ధార్మిక కార్యక్రమాల్లో ఎంతో చురుగ్గా పాల్గొనే ఆయన హైదరాబాదులో ఆదివారం వేకువ జామున మృతి చెందారు. సోమవారం ఉదయం పిచ్చాటూరు రోడ్డులోని వారి స్వగృహంలో దహన క్రియలు నిర్వహించబడుతుందని కుటుంబసభ్యులు తెలిపారు. వారి మృతికి పలువురు సంతాపాలు తెలిపారు.

# శివయ్య సేవలో అతిధులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరుని సేవలో ఆదివారం న్యాయశాఖకు చెందిన పలువురు నాయమూర్తులు స్వామి వారి దర్శనానికి వచ్చారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ప్రొటోకాల్ ఎఇఒ సతీష్‌మాలిక్ స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వవేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఆదివారం గుజరాత్ హైకోర్టు జడ్జి మనవీంద్రనాథ్‌రావు కుటుంబసభ్యులతో వచ్చారు. అలాగే మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి దుప్పాల వెంకటరమణ కుటుంబసభ్యులతో వచ్చి దర్శించుకున్నారు. వారికి తీర్థ ప్రసాదాలను సతీష్‌మాలిక్ అందించారు. ఏర్పాట్లను టెంపుల్ ఇన్సెపెక్టర్లు హరియాదవ్, సుదర్శనం నాయుడు, సిఎస్‌ఓ నాగభూషణం నాయక్‌లు పర్యవేక్షించారు.

# "ముద్దికుప్పం పూర్విత" ప్రతిభకు అభినందనలు

చంద్రగిరి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



చంద్రగిరి గ్రామ పంచాయతీ సర్పంచ్ ముద్దికుప్పం రూప రామమూర్తి దంపతుల కుమార్తె ముద్దికుప్పం పూర్విత ఇంటర్మీడియెట్ బైపిసి మొదటి సంవత్సర ఫలితాల్లో అద్భుత ప్రతిభను కనబరచడంతో సర్వత్రా అభినందనలు అందుకుంటున్నారు. పూర్విత చురుకైన విద్యార్థిని కావడంతో తిరుపతిలోని ఇంటర్మీడియెట్ చైతన్య డాక్టర్స్ అకాడమీ బైపిసిలో చేర్పించారు. శుక్రవారం విడుదలైన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో పూర్విత 440 మార్కులకు 431 మార్కులు సాధించి తల్లిదండ్రులకు తగిన గౌరవాన్ని అందించింది. ఈ క్రమంలో పూర్వితకు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులతో పాటు స్థానికుల నుండి ప్రత్యేక అభినందనలు లభించాయి. ఈ సందర్భంగా భవిష్యత్తులో ఏమికావాలని కోరుకుంటున్నట్లు పూర్వితను ప్రశ్నించగా "కార్డియాలజీ" డాక్టర్ కావాలనుకుంటున్నట్లు ఆత్మస్థైర్యంతో వెళ్ళడించింది. ఆమె ఆశయం నెరవేరాలని ఆశీర్వదిద్దాం..!

## అత్యధిక మార్కులు సాధించిన కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థులు

కేవీబీ పురం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:

మండల కేంద్రమైన కేవీబీ పురం కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ఇంటర్ విద్యార్థులు అత్యధిక శాతం వందకి వంద శాతం సాధించారని ఆ కళాశాల స్పెషల్ ఆఫీసర్ సుకన్య పేర్కొన్నారు. ఏపీ మోడల్ స్కూలులో 97 మందికి గాను 74 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 91 మందికి గాను 79 మంది పాసయ్యారని తెలిపారు. మొదటి సంవత్సరంలో 34 మందికి గాను 32 మంది పాసయ్యారని తెలిపారు. టి.యామిని(417), టి.మీరషా(404), వి.సుమలత(404), ఎన్.సంధ్య(392), రెండో సంవత్సరంలో ఎం.లక్ష్మి(880), బి.దివ్య(861), టి.దివ్యశ్రీ(829) మార్కులు సాధించారు. ఈ విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

# సాయిబాబా మందిరంలో వివాహ నామ సంకీర్తనలు

కేవీబీ పురం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



మండల కేంద్రమైన కేవీబీ పురంలో ఆదివారం సాయిబాబా సత్సంగ మందిరంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రకాల సాయిబాబా భక్తిసేవలు అత్యంత వైభవంగా ఆలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి వివాహ నామ సంకీర్తనలతో భజన బృందం వైభవంగా భజరంగ్ చేశారు. సంకీర్తనలు పాడుతున్నారు. సాయంత్రం సాయిబాబా చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగించారు. పలు జిల్లాల నుంచి సాయిబాబా భక్తి బృందం అత్యధికంగా పాల్గొని 18వ వార్షికోత్సవంగా నిర్వహించారు. ఆలయంలో అన్నదాన కార్యక్రమం, రాత్రి భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని సాయిబాబా భక్తులు బంధు జనాలు అచంద వైభవంగా నిర్వహించారు. యువతి, యువకులు పాల్గొని భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

# ఇంటర్ ఫలితాలలో శ్రీధర్స్ సంచలనం

తిరుపతి విద్య ఏప్రిల్ 13 ప్రభాత వార్త



ఏఐఆర్ బైపాస్ రోడ్డు లోని శ్రీదర్స్ కాలేజ్ విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో అద్భుత ఫలితాలు సాధించినట్లు చైర్మన్ మద్దినేని శ్రీధర్ తెలియజేశారు. మొదటి సంవత్సరం పరీక్షల ఫలితాలలో సి.ఉమా మహేశ్వర్ ఎంపీసీ విభాగంలో 465 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండవ స్థానములో అలాగే కె. నిత్య శ్రీ కళ్యాణి, 464, ఎ. లీనా శ్రీ 464, వి.శ్రీకర్ రెడ్డి 463. ఎస్.యామిని 462, కె. పనుష్య 462, పి. వాసవి 462 పి.మానస. 462, సి.షామిత రెడ్డి 460. పి. యశ్విత 460 మార్కులు అదేవిధంగా 450 మార్కులు పై బడి 37 మంది విద్యార్థులు సాధించారు. జూనియర్ బైపీసీ విభాగంలో సి. జోష్నా 433, వి.యస్. రక్షిత 426, ఎం.దివ్య 422. సి.ధన్యత 419, వి.ప్రియా దర్శిని 419. అదేవిధంగా 410 మార్కులు పై బడి 10 మంది విద్యార్థులు మార్కులు సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరం ఎంపీసీ మరియు బైపీసీ విభాగంలో బి.వనిక 987 మహమ్మద్ ఇమ్రాన్ 987, పి. నిఖిలేశ్వర్ 985, ఆర్. యుక్త 984, మహమ్మద్ తాలిబ్ 980, డి. పోషిత 980, అదేవిధంగా 950 మార్కులు పై బడి 28 మంది విద్యార్థులు సాధించారు. 98.31 శాతం ఉతీర్ణత సాధించారని సాధించారని చైర్మన్ మద్దినేని శ్రీధర్, అధ్యాపక అధ్యాపకేతర బృందం విద్యార్థులను పుష్ప గుచ్చాలతో అభినందించారు. ఈ ఫలితాలు కు తోడ్పడిన విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.

# ఇంటర్ ఫలితాలలో గీతం ప్రభంజనం

తిరుపతి విద్య ఏప్రిల్ 13 ప్రభాత వార్త



రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఫలితాలలో భవాని నగర్ లోని గీతం కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారని గీతం జూనియర్ కళాశాల చైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో ఏడుగురు విద్యార్థులు 466, నుండి 450 వరకు 50 మంది విజయం సాధించారు. బైపీసీలో ఆరుగురు 429 నుండి 422 మార్కులు సాధించారు. అలాగే రెండవ సంవత్సరం ఎంపీసీలో 986, 980 మాకు సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరం బైపిసిలో 983, 975, అలాగే సిఇసి లో 969, 964, 965 మార్కులు సాధించి ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు అధ్యాపక బృందానికి ప్రత్యేకంగా ప్రిన్సిపల్ బివి గోపీనాథ్ అధ్యాపకులకు అభినందనలు తెలియజేశారు.

# పిల్లలకు ఫోన్లు ఇచ్చి చదువుకి నాశనం చేయవద్దు - సీఐ

సత్యవేడు, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇచ్చి వారి చదువులకు దూరం చేయవద్దని తిరుపతి జిల్లా సత్యవేడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మురళీనాయుడు విద్యార్థుల తల్లి దండ్రులను కోరారు. స్థానిక వీఎంకే కల్యాణ మండపంలో శ్రీవిద్య హైస్కూలు కరస్పాండెంట్ నాగయ్య పర్యవేక్షణలో ప్రిన్సిపాల్ రాధ ఆధ్వర్యంలో 4వ వార్షికోత్సవ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రైవేటు స్కూలు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సుబ్రహ్మణ్యంరాజు, జిల్లా అధ్యక్షులు రమేష్ బాబు, మాజీ ఎంపీపీ మస్తాన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యాభ్యాస దశలో పిల్లల చేతిలోకి మొబైల్ ఫోన్ ఇస్తే చదువుపై దృష్టి సారించే అవకాశాలు ఉండదన్నారు. పిల్లలు వారి చదువులపై నిమగ్నం అయ్యేటట్టు చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉన్నట్లు ఆయన గుర్తు చేశారు. గడిచిన నాలుగేళ్లుగా నాణ్యత కూడిన విద్యను అందిస్తూ పిల్లలకు క్రమశిక్షణ నేర్పిస్తూ వారి దృఢ సంకల్పాన్ని పెంపొందిస్తున్న శ్రీవిద్య హైస్కూలు యాజమాన్యాన్ని ఆయన కొనియాడారు. అంతకు ముందు సీఐను హైస్కూలు కరస్పాండెంట్ నాగయ్య శాలువ కప్పి ఘన సత్కారంతో పాటు జ్ఞాపికలను అందించారు. పిల్లలు ప్రదర్శించిన సీతారాముల భరతనాట్యం విశేషంగా ఆకట్టుకుంది. వివిధ పోటీల్లో విజేతలైన 300 మంది విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుధాకర్, పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సీతారాముల కల్యాణోత్సవంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్ దంపతులు

విజయపురం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



మండలంలోని ఎం అగరం గ్రామంలో శనివారం రాత్రి రామాలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో టీడీపీ కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, సరిత దంపతులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధిస్తే సీతారాముల కల్యాణం చేస్తామని వేడుకోవడంతో మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్సీ కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, అరుణ మిల్క్ డెయిరీ ఎండీ మునిశేఖర్ నాయుడు, నగరి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోవర్ధన్‌నాయుడు, స్థానిక నాయకులు రవినాయుడు, దాము నాయుడు, శంకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సారూ...రోడ్డులో గుంతలు పూడ్చండి

విజయపురం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



సారూ...రోడ్డులో గుంతలు పూడ్చండి అంటూ మండలంలోని మహారాజపురం వాసులు కోరుతున్నారు. కనకమ్మసత్రం-మహారాజపురం సరిహద్దు రోడ్డు గుంతలమయమైన ప్రదేశంలో ఉన్న షాపుల ముందర వాహనాలు నిలబెట్టడం వలన తరచూ ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. మహారాజపురం రోడ్డు గుంతల్లో కోళ్ల రక్తాన్ని, అవశేషాలను పారపోయడం వలన దుర్గంధమైన వాసన వెదజల్లుతుందని వాపోతున్నారు. అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు. మండలంలోని ఆలపాక కండ్రిగ-జీఎంపురంరోడ్డుగుంతలమయంగాఉందని మరమ్మతు చర్యలు నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# రేపటి నుంచి పీజీ పరీక్షలు

తిరుపతి విద్య ఏప్రిల్ 13 ప్రభాత వార్త

ఎస్వీయూ పరిధిలో అన్ని పీజీ కళాశాలలో సైన్స్ గ్రూప్లకు చెందిన అన్ని కోర్సులకు మంగళవారం నుంచి నాల్గవ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు ఇప్పటికే హాల్టికెట్ల జారీ ప్రక్రియ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న పీజీ సైన్స్ కోర్సుల పరీక్షలు ఈనెల 23వరకు కొనసాగనున్నాయి. త్వరలో ఆర్ట్స్, కామర్స్ అండ్ కంప్యూటర్ పీజీ కోర్సుల పరీక్షల షెడ్యూల్ విడుదల చేయనున్నారు.

# తిరుపతి డివిజన్

## శ్రీ చక్ర సోషల్ సర్వీస్‌కు ఎమ్మెల్యే గాలి భాను తన వంతు సాయం

తిరుపతి హెల్త్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ః



శ్రీ చక్ర సోషల్ సర్వీస్‌కు తన వంతు సాయం చేస్తానని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ నాయుడు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే గాలి భాను స్వగృహం నందు శ్రీ చక్ర సోషల్ సర్వీస్ అధ్యక్షులు జోరేపల్లి మనోజ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. మనోజ్‌కుమార్ మాట్లాడుతూ తిరుచానూరులో 2021లో శ్రీ చక్ర సోషల్ సర్వీస్ అనే సంస్థను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రధానంగా రూరల్ ప్రాంతాల్లో ఉన్న పేద ప్రజలు, చిన్నారులను, అనాథ పిల్లలను గుర్తించి వారిని ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆదుకోవడం జరుగుతుందని చెప్పారు. అంతే కాకుండా తిరుపతి జిల్లాలోనే కాకుండా చిత్తూరు జిల్లాలో, నగరి నియోజక వర్గంలోని పేదలను గుర్తించి వారిని ఆదుకుంటున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వచ్చారు. దీంతో ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ నాయుడు స్పందిస్తూ శ్రీ చక్ర సోషల్ సర్వీస్‌కు తన వంతు ఎప్పుడూ సహాయ సహకారాలు ఉంటాయని, రెవెన్యూ అధికారులతో మాట్లాడి అసోసియేషన్‌కు అవసరమైన స్థలాన్ని మంజూరు చేసే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. దీంతో అసోసియేషన్ నేతలు ఎమ్మెల్యేకి అభినందనలు తెలియజేయడంతో పాటు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు, సభ్యులు ప్రవీణ్, పాల్గొన్నారు.

# కళాశాల అభివృద్ధికి సహకరిస్తాం

పాకాల, ఏప్రిల్ 13, ప్రభాతవార్త



పాకాల మండలం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అభి వృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని శాసన సభ్యులు పులివర్తి నాని అన్నారు. ఆదివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల 17 వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గని ప్రసంగించారు. కళాశాలకు నూతన భవనాన్ని మంజూరు చేయిస్తానని, పాకాలలు మహిళా హాస్టల్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. విద్యార్థులు లక్ష్యసాధనకోసం పట్టుదలతో ప్రయత్నిస్తే ఎతప్పక విజయం లభిస్తుందన్నారు. విద్యారంగం అభ్యున్నత కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని విద్యార్థులు ఆ అవకారాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రధానాచార్యులు జీ. మొహిద్దీన్ బాషా, డా.దామోదర్ నాయుడు, ప్రధానాచార్యులు డా. సెస్ .వి . రమేష్ కుమార్, వైసీ ప్రిన్సిపాల్ మాసులామణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గన్నారు.

# భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం పాదయాత్ర

పాకాల, ఏప్రిల్ 13, ప్రభాతవార్త



పాకాల మండలంలోని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం గత 125 సంవత్సర వేడుక పాదయాత్ర ఘనంగా జరుపుకున్నారు. సెయింట్ పాల్స్ సీఎస్ఐ చర్చిలో పాస్టర్ ప్రేమ్ కుమార్ ప్రత్యేక ప్రార్థన లుజరిగాయి. సంఘవిశ్వాసులు, పిసిమెంబెర్స్ పాల్గొన్నారు.

# బిపి మండల్ వర్ధంతి వేడుకలు

తిరుపతి(రవాణ), ఏప్రిల్ 13ప్రభాతవార్త



వెనుకబడిన తరగతుల ఆరాధ్యుడు బిపి మండల్ వర్ధంతి వేడుకలను తిరుపతిలో బిజెపి నాయకులు జరుపుకున్నారు. బిసిసంఘర్షణ సమితి నాయకులతో కలసి మండల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల కోసం నియమించిన కమిషన్‌కు బిపిమండల్ ఛైర్మన్‌గా వ్యవహరించి, దేశవ్యాప్తంగా తిరిగి అధ్యయనం చేశారన్నారు. బిసిలలో తక్కువ జనాభా వున్న ఓబిసిలను గుర్తించి తగిన ప్రాధాన్యత రిజర్వేషన్ కల్పించడంలో ఆయన కృషి చేశారన్నారు. నివాళులర్పించినవారిలో బిజెపి, బిసి సంఘర్షణసమితి నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, కట్టమంచి చంద్రబాబు, మోహన్‌రాజు,. సుబ్రమణ్యంరెడ్డి, విక్రమ్‌స్వామి, లోకేశ్ ఉన్నారు

# కదులుతున్న రైలు నుండి పడి యువకుడు మృతి...



**రేణిగుంట ఏప్రిల్ 13 ప్రభాతవార్త** రేణిగుంట జి ఆర్ పి పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే కోడూరు సమీపాన ఉప్పరపల్లి రైల్వే గేటు వద్ద సుమారు 25 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని యువకుడు రైలు నుండి ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. రేణిగుంట రైల్వే పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ గౌరీ శంకర్ కథనం మేరకు కడప వైపు నుండి రేణిగుంట వైపు వస్తున్న రైలు నుండి యువకుడు ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుని మణికట్టుపై హిందీలో సరిగా కనిపించని పచ్చబొట్టు పొడిపించుకుని ఉన్నాడు. ఇంతకుమించి ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుని ఆచూకీ తెలిసినవారు 9885753379, 9963126343 మొబైల్ నంబర్లకు సమాచారం తెలియజేయాలని రైల్వే పోలీసులు కోరారు.

# బోయలను గిరిజన జాబితాలో చేర్చకండి ..

రేణిగుంట ఏప్రిల్ 13 ప్రభాతవార్త




బీసీ ఏ కులంకు చెందిన బోయలను ఇతర కులాలను గిరిజన జాబితాలో చేర్చవద్దంటూ అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం, ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం డిమాండ్ చేస్తూ ఆదివారం రేణిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ధర్నా చేశారు. వీరిని ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల ఎరుకల, యానాది, లంబాడి, శికారి కులాలకు ద్రోహం చేయడమేనని అన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు దినారి ప్రభాకర్, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి హరినాథ్, ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టేటి ప్రసాద్, అఖిలభారత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు అజ్మీర్ రవి నాయక్, మండల కార్యదర్శి గోళ్ళ వెంకటరమణ, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం మండల అధ్యక్షురాలు ధరణి, మండల కార్యదర్శి కొండ్రెడ్డి ఈశ్వరమ్మ, ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు మేండ్ర గుత్తి చీరాలయ్య, గిరిజన సంఘం మండల నాయకులు రోడ్డ మునిస్వామి, శ్రీకాంత్, రత్నబాబు, ఈశ్వరయ్య, ఆనంద్ బాబు, గుణశేఖర్, విజయమ్మ, రాముడు, గురుమూర్తి, సుధాకర్, సులోచన, భాస్కర్, ప్రభా జ్యోతి, గాయత్రి, గీత, చెన్నకేశవులు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన...

రేణిగుంట ఏప్రిల్ 13 ప్రభాతవార్త



రేణిగుంట మండలం గాజుల మండ్యం కృష్ణ భజన మందిరంలో మందిర కమిటీ అధ్యక్షులు ఇందు కుమార్ రెడ్డి, క్షత్రియ స్టేట్ బోర్డ్ డైరెక్టర్ జి పాలెం తేజవతి ఆధ్వర్యంలో తిరుపతి రేవా డయాబెటిక్ క్లినిక్ సహకా రంతో ఆదివారం జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ రేఖ కత్తుల వైద్య బృందం స్త్రీలకు వ్యాధులకు, చర్మ వ్యాధులకు, కీళ్ల వ్యాధులకు, జనరల్ వ్యాధులకు వైద్య, రక్త, బిపి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరానికి వచ్చిన వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం పెట్టారు. బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకులు లింగారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, జి పాలెం శివారెడ్డి, రాజా రేవంత్ రెడ్డి, సుధీర్ రెడ్డి, తిరుపతి రేవా డయాబెటిక్ క్లినిక్ వైద్య నిపుణులు సిబ్బంది పాల్గొన్నారు.

# బడికి టీచర్లు మాత్రమే వచ్చారు

వడమాలపేట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:

జిల్లాలో ఆదివారం పాఠశాలలు పని చేశాయి. ఉపాధ్యాయులు మాత్రమే హాజరు కాగా విద్యార్థులు మాత్రం రాలేదు. విద్యా సంవత్సరంలో కనీసం 221 రోజులు పనిదినాలు ఉండాలి. తిరుపతి జిల్లాలో రెండు పని దినాలు తగ్గాయని డీఈవో కె.వి.ఎన్.కుమార్ ఆదివారం పని చేయాలని ప్రకటన విడుదల చేశారు. దీనిని ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకించినా, అధికారుల ఆదేశాలను ఆచరించక తప్పలేదు. ఆదివారం స్కూల్స్ తెరుచుకుని విద్యార్థులు రాకపోవడంతో ఉపాధ్యాయులు టైంపాస్ చేసి వెళ్లారు. కొన్ని పాఠశాలల్లో పది శాతం, మరికొన్ని స్కూళ్ళలో 20 శాతం మంది విద్యార్థులు వచ్చినట్లు తెలుస్తోంది. వడమాలపేట హైస్కూలు 280 విద్యార్థులకు గాను 70మంది మాత్రమే హాజరయ్యారు. అందులో 60 మంది బాలికలు రావడం విశేషం. వచ్చిన విద్యార్థులను ఆటవిడుపుగా గ్రౌండ్‌కు తీసుకెళ్లి ఉపాధ్యాయులు ఆడించి పంపేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో పరీక్షలు అయిపోయాయని, మామూలు రోజుల్లోనే విద్యార్థులు రారు. అలాంటిది ఆదివారం పెట్టుకుంటే వస్తారా అని అంటున్నారు.

## పరశురామేశ్వరుని సేవలో ఆర్‌డిఓ

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 13 ప్రభాతవార్త



గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరని సన్నిధిలో ఆదివారం శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి పూజ లు నిర్వహించారు. మహిమాన్వితం, చారిత్రాత్మకం కల్గిన ఈ ఆలయాన్ని అభివృద్ధికి ఇటీవల పలు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు.ఈ నేపధ్యంలో అధ్వాన్నంగా ఉన్న పాపానాయుడుపేట నుంచి రోడ్డును ఇటీవల శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి చొరవ తీసుకొని జిల్లా కలెక్టర్ నుంచి ప్రత్యేక నిధులతో చక్కటి రోడ్డును నిర్మించారు. దాంతో తిరుపతికి వచ్చే అతిధులు గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరాలయాన్ని దర్శించుకుంటున్నారు. ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డికి ఆలయం వద్ద వేదపండితులతో స్వాగతం పలికి దర్శనం తరువాత వేదపండితులతో ఆశీర్వచనాలుతీర్థ ప్రసాదాలను ఆలయ ఇఓ రామచంద్రారెడ్డి,మాజీ చైర్మెన్ గిరినాయుడులు అందించారు.

## కల్తీ,నెయ్యి కప్పిపుచ్చుకునేందుకే గోవుల డ్రామా

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 13 ప్రభాతవార్త



తిరుపతి మాజీ ఎంఎల్ఏ, తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ చైర్మెన్ కరుణాకర్‌రెడ్డి 13 అబద్దాలతో కలియుగ దైవం వెంకన్నకు కోపం తెప్పిస్తున్నారు. శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి శివమెత్తారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ క ల్తి నెయ్యి పాపాన్ని కప్పిపుచ్చుకోవటానికి వైకాపా జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి కొత్తగా గోవుల డ్రామాకు తెరతీసారని ధ్వజమెత్తారు.టిటిడి గోశాలలో గోమాతల మార్ఫింగ్ ఫోటోలతో రాజకీయాలు చేయటం తగదన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహారిస్తున్నారని ధ్వజమెత్తారు. కరుణాకర్‌రెడ్డి చైర్మెన్‌గా ఉన్న హయాంలోనే కల్తినెయ్యివ్యవహారం చోటు చేసుకుందన్నారు.ప్రభుత్వం నియమించిన సిట్ వ్యవహారంలో ఆసక్తి కర విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. సిట్ అదుపులో పలువురిని తీసుకోవటంతో ఎక్కడ తమ గుట్టు రట్టు అవుతోందని భావించి గోశాల అంశాన్ని తెరమీదకు తెచ్చారన్నారు. ఎంతో పవిత్రమైన పుణ్యక్షేత్రం తిరుమల పవిత్రను భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా అబద్దపు ప్రచారాన్ని తెరమీదకు తెచ్చారని సుధీర్‌రెడ్డి ధ్వజమెత్తారు. గత వైకాపా పాలనతో పోల్చుకుంటే ప్రస్తుతం తిరుమలలో ఎన్నో సదుపాయాలు ఏర్పాటు చేసారన్నారు. తాను ఒక నాస్తికుడని ప్రకటించుకున్న భూమన కరుణాకర్‌రెడ్డి టిటిడి చైర్మెన్‌గా అవినీతి పాలన,అక్రమాల సామ్రాజ్యంగా మార్చారని దోపిడిలకు పెట్టింది పేరుగా సాగిందన్నారు. అందులో కల్తి నెయ్యి ఒకటి మాత్రమే అన్నారు.వారి పాలనలోని అవినీతి కకుంభకోణాలను వెలుగు చూస్తుండటంతో అసలు వ్యవహారాలను పక్కదారి పట్టించుటకు కరుణాకర్‌రెడ్డి కొత్త ఎత్తుగడలను వేస్తున్నారన్నారు. ఎన్ని ఎత్తుగడలు వేసిన నిజం నిప్పులాంటిదని బయటకు రాక తప్పదని అందులో కాలిబూడిద కాక తప్పదనే విషయాన్ని తెలుసుకునే రోజుల దగ్గలో ఉందని సుధీర్‌రెడ్డి హెచ్చరించారు.

## ఇంటర్ పరీక్షల్లో రాలయసీమ విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



2024-25 సంవత్సరానికి మార్చిలో జరిగిన ఇంటర్ పరీక్షల్లో పట్టణంలోని రాయలసీమ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయదుందుబి మోగించినట్లు కరస్పాండెంట్ కాయం సుబ్బరా మిరెడ్డి, ప్రిన్సిపల్ జయభారత్‌రెడ్డిలు తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫరీక్షా ఫలితాల్లో ఎంపిసి గ్రూపులో 470 మార్కులకు గాను జిఎం.వంశీ కృష్ణ(464), కె.విష్ణుప్రియ (464), బైపిసి గ్రూపులో 440 మార్కులకు గాను బి.షారోన్ ప్రియం(428), ఎన్‌కె.బూమాయాస్మిన్(415), మరియు సిఈసి గ్రూపు లో 500 మార్కులకు డి.గణేష్(477), పి.నిషిత్‌అమీన్(476) మార్కులు సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు గాను ఎంపిసి గ్రూపులో ఎస్‌కె.అమీరున్(979), ఎస్.శ్రీను(978), పి.గగన(977), పి.జాహ్నవి(974), కెఎం.షాహిద్(971), బైపిసి గ్రూపులో 1000 మార్కులకు గాను 969, 951, 949,, సిఈసి గ్రూపులో 1000 మార్కులకు గాను జి.నాగేశ్వరి(964), టి.రేవతి(955) మార్కులు సాధించినట్లు తెలిపారు. అన్ని గ్రూపుల నుంచి జూనియర్ ఇంటర్400 మార్కులకు పైగా సాధించిన 40మంది, సెకండర్ ఇయర్‌లో 900లకు పైగా మార్కులు సాధించిన 60మంది విద్యార్థులకు కళాశాల యాజమాన్యం అభినందించారు.

## రాష్టస్థాయి విద్యార్థికి అభినందనలు

తొట్టంబేడు, ఏప్రిల్ 13 ప్రభాతవార్త




ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షా ఫలిత ఆల్లో తిరుపతి జిల్లాలోనే అత్యుత్తమ మార్కులు సాధిం చిన ఏ.భావన (467/470) అత్యుత్తమ మార్కులు సాధిం చి ప్రథమస్థానం సాధించినట్లు ఎంజిఎం విద్యాసంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ తెలిపారు. ఈసందర్భంగా ఆదివారం తిరుపతిజిల్లాలోనే అత్యుత్తమ మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలచిన ఏ.భావనను పుష్పగుచ్చం అందించి అభినందించారు. అనంతరం మయూర్ మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో ఎంజిఎం ఇన్స్టిట్యూట్ అధునాతన పద్దతిలో విద్యార్థులను తీర్చిదిద్దడమే కాకుండా రాష్ట్ర స్థాయి మార్కులు సాధించినందుకు ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.

## నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

.శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీకాళహస్తి అగ్నిమాపకశాఖ అధికారి నాగార్జునరెడ్డి అన్నారు. ఉదయం 10గంటలకు అగ్నిమాపక శాఖ కార్యాలయంలోజరిగే సమావేశానికి ముఖ్యఅతిధిగా శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓ బాపిరెడ్డిముఖ్యఅతిధిగా విచ్చేస్తున్నారని నేటి నుంచి ఈనెల 21వ తేదీ వరకు అగ్నిమాపకశాఖ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## బాలికల గురుకులంలో హర్షిత టాపర్

సత్యవేడు, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



సత్యవేడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల కళాశాలలో సీనియర్ ఇంటర్ బైపీసీలో విద్యార్థి హర్షిత టాపర్‌గా నిలిచింది. శనివారం విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో బాలికల గురుకుల పాఠశాలలో వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధిం చారు. తిరుపతిలో నివాసం ఉంటున్న చిరంజీవి కుమార్తె హర్షిత సీనియర్ ఇంటర్ బైపీసీ గ్రూపులో వెయ్యి మార్కులకు 976 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచారు.

## సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగిన కోదండరాముడు

తవణంపల్లె, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



మండలంలోని అరగొండ శ్రీకోదండరామస్వామి దేవస్థా నంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగం గా ఆదివారం శ్రీసీతా లక్ష్మణ సమేతుడైన కోదండ రాముడు సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానంలో ఈనెల 6 నుండి జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి ఉదయం సూర్యప్ర భవాహన సేవ, రాత్రి చంద్రప్రభ వాహనసేవ కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం జరిగిన సూర్యప్రభ వాహన సేవ కార్యక్రమానికి గాజులపల్లెకు చెందిన ఆనందనాయుడు కుమారులు, రాత్రి జరిగిన చంద్రప్రభ వాహనసేవ కార్యక్రమానికి అరగొండ భాస్కరమెడికల్స్ వారు ఉభయదారులుగా వ్యవహరించి వరుస ఉభయం తీసుకు వచ్చారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై వుంచి సూర్య, చంద్రప్రభ వాహనాలపై వుంచి పురవీధుల్లో ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు అరగొండ పరిసర గ్రామస్థులు పాల్గొన్నారు.

## గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర మహిళలకు స్ఫూర్తి

-మాజీ ఎంపీ విజయేంద్ర ప్రసాద్

తవణంపల్లె, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



మాజీ మంత్రి గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర మహిళలకు స్పూర్తిదాయకమని ప్రముఖ సినీ దర్శకుడు రాజమౌళి తండ్రి సినీ రచయిత మాజీ ఎంపీ విజయేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన మాజీ మంత్రి గల్లా అరుణ స్వగ్రామం దిగువమాఘంకు విచ్చేశారు. ఈయనకు గల్లా అరుణ, రామచంద్రనాయుడు దంపతులు, మాజీ ఎంపీ గల్లా జయదేవ్, రమాదేవిలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన రాజన్న పార్క్‌కు చేరుకుని మాజీ ఎంపీ దివంగత రాజగోపాల్‌నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మంచి తండ్రికి కూతురుగా, మంచి భర్తకు భార్యగా, పిల్లలకు మంచి తల్లిగా ప్రజలకు మంచి సేవలు అందించే నాయకురాలిగా ఎదిగిన అరుణమ్మ మహిళలకు సూర్తిదాయకమన్నారు. అరుణకుమారి అనుమతిస్తే ఆమె స్వీయ చరిత్రపై వెబ్ సిరీస్ తీయడానికి ఆలోచిస్తున్నట్లు విజయేంద్రప్రసాద్ తెలిపారు. అలాగే గల్లా అరుణకుమారి దిగువమాఘంలో ప్రజలకు అందిస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన స్వయంగా పరిశీలించారు.

## భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా కరుణాకర్‌రెడ్డి తప్పుడు ప్రచారం

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వైకాపా నాయకులు భూమన కరుణాకర్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ధ్వజమెత్తారు. చిత్తూరులో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తిరుమల-తిరుపతి దేవస్థానంపై తప్పుడు ప్రచారం చేస్తున్న భూమన కరుణాకర్‌రెడ్డిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూమన కరుణాకర్‌రెడ్డి మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, తిరుమల-తిరుపతి దేవస్థానంలో వంద గోవులు మృతి చెందాయని ప్రచారం చేయడం పూర్తి అవాస్తవమన్నారు. తి వృద్ధ్యాప్యం ఇతర వ్యాధులతో పశువులు మృతి చెందడం సాధారణమని, కేవలం టిటిడి ప్రతిష్టను దెబ్బతీయడానికే వందల సంఖ్యలో పశువులు మృతి చెందాయని వైకాపా నేత భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపిస్తున్నారని ధ్వజమెత్తారు. కేవలం ఒక ఉద్యోగికి మద్దతుగా తప్పుడు ప్రచారం చేయడం వైఎస్‌ఆర్‌సిపి పార్టీకి తగదన్నారు. గోశాలను సందర్శించిన భక్తులు సైతం గోశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇకనైనా వైకాపా నాయకులు తప్పుడు ప్రచారాలు మానుకోవాలని లేని పక్షంలో తగిన శాస్తి జరుగుతుందన్నారు.

## పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త

పాలసముద్రం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:

వేసవి సెలవులు ప్రారంభం కానుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్తగా వుండాలని ఎస్ఐ చిన్నరెడ్డప్ప పేర్కొన్నారు. పాలసముద్రం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఎస్ఐ చిన్నరెడ్డప్ప విలేకరులతో మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఇంటి వద్ద వున్న విద్యార్థులు వాహనాలను రోడ్డుపైకి తీసుకొచ్చి నడిపినా, చెరువులు, కుంటలు, బావుల వద్దకు వెళ్ళి ప్రమాదాలు కొని తెచ్చుకునే అవకాశాలు వుంటాయని ఈ విషయంపై తల్లిదండ్రులు జాగ్రత్తగా వుండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ వారికి తగు సూచనలు చేస్తుండాలని, బావులు, కుంటలు, చెరువుల వద్దకు వెళ్ళకుండా చూడాలన్నారు. ఎలాంటి దురదృష్టకర సంఘటనలు జరుగకముందే తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించి పిల్లలకు ఎలాంటి ఆపద రాకుండా జాగ్రత్త వహించాలన్నారు.

## నేడు ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం రద్దు.

కుప్పం ఏప్రిల్ 13 ప్రభాతవార్త:

ప్రతి సోమవారం నియోజకవర్గస్థాయిలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కారవేదిక అంబేద్కర్ జయంతి కారణంగారద్దుచేసినట్లు కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్‌వర్మ తెలిపారు.ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

## ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో రాభియా విశేషప్రతిభ

కుప్పం ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



ఇంటర్ మీడియట్ సెకండ్‌ఇయర్ పరీక్షఫలితాల్లో కుప్పం పట్టణంకు చెందిన రాభియా ముసైభా అనువిద్యార్థిని ఉత్తమ ప్రతిభచాటింది.ఇంటర్ సెకండియర్ విభాగంలో ఈవిద్యార్థిని మెత్తం 984మార్కులు సాధించి ఏ గ్రేడ్‌లో నిలిచింది.ఈ సందర్భంగా రాబియాను పలువురు స్థానికులు అభినందించారు.ఈ విద్యార్థిని కుప్పం జూనియర్ కాలేజ్‌లో ఇంటర్ చదివింది.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తిమృతి.

శాంతిపురం ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



మండలంలోని మఠం గ్రామం సమీపంలో ఆదివారం వేకువజామున ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన సంఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు రాళ్ళబూదగూరు ఎస్సై నరేష్ తెలిపారు.మృతుడికి సుమారు 60-70 ఏళ్ళ వయసు ఉంటుందని తెలిపారు.మృతుడి ఆచూకీతెలిసినవారు లేదా అతని సంబంధిత వ్యక్తులు ఎవరైనా ఉంటే రాళ్ళబూదగూరు ఎస్సై 9440900734 నెంబరుకు తగు సమాచారం అందించాలని ఆయన కోరారు.

## ఘనంగా శ్రీ పెద్దపల్లి గంగమ్మ రథోత్సవం

కుప్పం ఏప్రిల్ 13 ప్రభాతవార్త:

కుప్పం కొత్తపేటలో వెలసిన శ్రీ ప్రసన్న పెద్దపల్లి గంగమాంబ జాతరలో బాగంగా ఆదివారం అమ్మవారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి రథంలో ఊరేగింపు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.కాగా శనివారంరాత్రి అమ్మవారి కళ్యాణోత్సవాన్ని కన్నులపండుగగా నిర్వహించారు.ఈ నెల 19వతేదీ అమ్మవారి అగ్నిగుండప్రవేశం పచ్చిగరెగ ఊరేగింపు పుష్పపల్లకి బాణవేడుకలు 20వతేది అమ్మవారికి మహిళలచే పొంగళ్ళ సమర్పనతో జాతర ముగుస్తుందని ఆలయ దర్మకర్త శివకుమార్,కార్యదర్శి వెంకటేష్ తెలిపారు.భక్తులు అధికసంఖ్యలో హాజరు కావాలని వారుకోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## గోమరణాలపై అసత్య ప్రచారాలు సరికాదు

-ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు,ఏప్రిల్ 13,ప్రభాతవార్త:



టిటిడి గోశాలలో గోమరణాలపై అసత్య ప్రచారాలు చేయడం సరికాదని కరుణాకర్ రెడ్డి వ్యాఖ్యలను పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఖండించారు.ఆదివారం ఓ ప్రకటనలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మాట్లాడుతూ టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి గోశాలపై చేసిన ఆరోపణలు అవాస్తవాలని తెలిపారు.కోట్లాది మంది ప్రజలతో పాటు భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా అసత్య ప్రచారం చేయడం సరికాదని తెలిపారు.రాజకీయ ప్రయోజనాల కోసం వందలాదిగా గోవులు చనిపోయాయని తగిన పర్యవేక్షణ లేదని చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను ఆయన వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.గతంలో శ్రీవారి విషయంలోనూ కరుణాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధాకరమన్నారు.ఇలాంటి వ్యాఖ్యలతో టిటిడి ప్రతిష్టకు ఏమాత్రం భంగం వాటిల్లదని ఆరోపణలు చేసిన వారు మాత్రం అప్రతిష్ట పాలుకావడం ఖాయమన్నారు.

## వైకాపా రాష్ట్ర విద్యార్థి విభాగ సంయుక్త కార్యదర్శిగా కళ్యాణ్‌భరత్

చౌడేపల్లి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



వైకాపా రాష్ట్ర విద్యార్థి విభాగ సంయుక్త కార్యదర్శిగా చౌడేపల్లి శివాలయం వీధికి చెందిన కళ్యాణ్‌భరత్ నియమితులయ్యారు. ఈ మేరకు అధిష్టానం నుంచి ఉత్తర్వులు అందాయి. తొలి నుంచి పార్టీకి విధేయుడుగా వున్న కళ్యాణ్ భరత్ ఇప్పటికే వివిధ పదవులను సంవర్ధవంతంగా నిర్వర్తించారు. దీంతో ఆయన్ను విద్యార్థి విభాగ సంయుక్త కార్యదర్శిగా నియమించారు. ఇంతటి పదవిని నమ్మకంతో అప్పగించిన మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, జడ్పి మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, రాష్ట్ర దృశ్యకళలు అకాడమీ మాజీ ఛేర్మన్ కూరపర్తి అంజిబాబులకు కళ్యాణ్‌భరత్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి దశనుంచి పార్టీ బలోపేతం చేసి, పూర్వ వైభవం తెస్తానని ఆయన హామీ ఇచ్చారు.

## గంగమ్మ సేవలో ఎంపి ఎమ్మెల్యేలు

బోయకొండ(చౌడేపల్లి), ఏప్రిల్ 13 ప్రభాతవార్త



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మను హిందూపురం ఎంపి పార్థసారధి, అనంతపురం ఎమ్మెలల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్‌లు దర్శించుకొన్నారు. వారిని ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనభాగ్యం అనంతరం మండపంలో వేదాశీర్వాదం, అమ్మవారి పవిత్ర తీర్థ ప్రసాదాలందించి సత్కరించారు. ఆలయ అధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీకృష్ణదేవరాయల జయంతిని క్యాలెండర్లో చేర్చాలి

సదుం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన క్యాలెండర్లో శ్రీకృష్ణదేవరాయల జయంతిని కూడా చేర్చాలని సదుం మండల బలిజ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఉత్సవాలుగా వడ్డే ఓబన్న జయంతి త్రిపురనేని రామస్వామి జయంతి, యోగి వేమన జయంతి, వాసవి కన్యకా పరమేశ్వరి దినం, దామోదరం సంజీవయ్య జయంతి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి ,పొట్టి శ్రీరాములు జయంతి కవయిత్రి మల్ల జయంతి, మహాత్మ జ్యోతి బా పూలే జయంతి,బిఆర్ అంబేద్కర్ జయంతి, అల్లూరి సీతారామరాజు జయంతి తదితరుల జయంతులను వర్ధంతిలను క్యాలెండర్‌లో చేర్చారని దేశాన్ని పరిపాలించినటువంటి శ్రీకృష్ణదేవరాయల జయంతిని వర్ధంతిని మాత్రం చేర్చలేదని ఇది ఎంతో శోచనీయమని వారు పేర్కొన్నారు బలిజల ఓట్లతో పైకి వచ్చిన నాయకులు అధికారంలోకి వచ్చిన నాయకులు శ్రీకృష్ణదేవరాయల్ని మర్చిపోవడం బాధాకరమైన విషయం అన్నారు.

## కరుణాకర్‌రెడ్డిపై మండిపడ్డ పూతలపట్టు ఎమ్మెల్యే

పూతలపట్టు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త



తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా రెండు పర్యాయాలు పనిచేసిన భూమన కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలు అసహ్యాన్ని పుట్టిస్తున్నాయన్నారు. తిరుమల గోశాలలో ఆవులు ఇచ్చిన పాలు, పెరుగు, మజ్జిగ తిని రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వాన్ని విమర్శించడానికి మాట్లాడడానికి ఇంకేమీ దొరక్క ప్రభుత్వంపై అసత్యమైన ఆరోపణలు చేస్తూ పబ్బాలు గడుపుకుంటున్నారు. గోశాలలో చనిపోయినట్టు ఆవులను ఫోటోలు చూపించారు. అవి నిజమైన నిరూపించే దమ్ముందా అని ప్రశ్నించారు. గోశాలలో పశువులు ఈ ప్రభుత్వంలో మరణించాయా లేక మీ ప్రభుత్వంలో కూడా మరణించాయా సహజంగా మరణించడం గోవులకి పంచనామా చేయించామని నిరూపించగలరా, కల్తీ లడ్డు వ్యవహారాన్ని దృష్టి మళ్లించడం తగదన్నారు. గత ప్రభుత్వంలో తిరుపతి తిరుమల దేవస్థానంలో పనిచేసినటువంటి ఉద్యోగస్తులపై కక్షగట్టి ఇబ్బందులు గురి చేన్నారు.

## శాశ్వత నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

కాణిపాకం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం లో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు ఆదివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన ఎన్.శివప్రసాద్ అనే భక్తుడు నిత్యాన్నదాన పథకంకు 1,00,116 రూపాయలు విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఆలయ సూపరెంటెంట్ కోదండపాణికు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## సన్‌షైన్ అవార్డుకు ఎంపికైన బిఆర్ శ్రావంతి

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



రొంపిచెర్ల కెజివిబి పాఠశాలలో ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం చదువుతూ రాష్ట్రంలోని కెజిబివి పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన ఇంటర్మీడియేట్ ఫలితాల్లో అత్యధికంగా 935 మార్కులు సాధించిన బిఆర్ శ్రావంతి సన్‌షైన్ అవార్డుకు ఎంపికైంది. సన్‌షైన్ అ వార్డుకు ఎంపికైన బిఆర్ శ్రావంతిని సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ వెంకటరమణ, ఇతర సిబ్బంది అభినందించారు. బిఆర్ శ్రావంతి మంగళవారం మధ్యాహ్నం

## టుటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద చలివేంద్రం ఏర్పాటు

-పక్షులకు మంచినీరు

తొట్టంబేడు, ఏప్రిల్ 13 ప్రభాతవార్త




జిల్లాఎస్పీహర్ష వర్ధన్ రాజు ఆదేశాల మేరకు టుటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద పాదాచారులకు, ఈమార్గంలో వెళ్ళే వారికి, వివిధ పనుల నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారి దాహార్తిని తీర్చేందుకు చల్లని మంచి నీటిని అందించాలన్న ఉద్దేశ్యంతో చలివేంద్రాన్ని ఏర్పా టు చేసినట్లు టుటౌన్ సిఐ వెంకటేశులు తెలిపారు. శనివారం ఆయన చలివేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు మండుతుండడంతో పలువురు ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. అలాగే పక్షుల దాహార్తిని తీర్చేందుకు కూడా రెండు చిన్నపాటి కుండల్లో పోలీస్‌స్టేషన్‌పైన అక్కడకక్కడా నీటిని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఈ మార్గంలో వెళ్ళే మహిళలు, చిన్నారులు, ఆటో డ్రైవర్లకు చల్లటి నీటితో పాటు తొలిరోజు మజ్జిగను కూడా పంపిణీచేశారు. కార్యక్రమంలో సిఐతో పాటు ఎఎస్ఐ షణ్ముగం మరియు టుటౌన్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

**వేసవిలో ఇతర ప్రాంతాలకు వెళ్ళేవారు సమాచారం ఇవ్వండి..**

వేసవిలో ఇతర ప్రాంతాలకు వెళ్ళేవారు పోలీసులకు సమాచారం అందించాలని సిఐ వెంకటేశులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో చోరీలు ఎక్కువగా జరుగుతాయని, అయితే ముందస్తుగా సమాచారం అందిస్తే ఇంటికి ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు ప్రస్తుతం కొత్తగా వచ్చిన అలారం క్లాక్‌లను ఏర్పాటు చేస్తామని ఈ ప్రాంతాల్లో పోలీసు బందోబస్తుకూడా ఉంటుందన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## నిరుద్యోగులకు ఉద్యోగ భరోసా కల్పిస్తున్న బొజ్జల

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



తండ్రికి తగ్గ తనయుడుగా శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజల చేత మన్ననలు పొందిన బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి నిరుద్యోగులకు ఉద్యోగ భరోసా కల్పిస్తున్నారని తెలుగుదేశంపార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్‌రావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతి సందర్భంగా శ్రీకాళహస్తిలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తూ పదుల సంఖ్యలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి కంపెనీల ( పతినిధులను ఆహ్వానించి నిరుద్యోగయువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఎంఎల్ఏ చేస్తున్న గొప్ప కార్యక్రమంలో అందరు భాగస్వామ్యం అవ్వాలన్నారు. ఈనెల 15వతేదీన తొట్టంబేడు గ్రామసమీపంలో ఉన్న బైపాస్ వద్ద గల ఎస్ఎస్ కళ్యాణ మండపం వద్దకు విచ్చేయాలని కోరారు. కార్యక్రమంలో మిన్నల్‌రవి, బుజ్జి, కోటచంద్రశేఖర్; సయ్యద్‌చాంద్‌బాషా, జిలానీ, రియాజ్, జమీర్, ఇర్షాద్, షహద్, మీర్జావలి, ఫర్హా, మునిరాజ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంను కలిసిన ప్రభుత్వవిప్ డా॥ కంచెర్ల శ్రీకాంత్

కుప్పం ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ప్రభుత్వవిప్ ఎమ్మెల్సీ డా॥కంచెర్ల శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు.రాజధాని అమరావతి నగరంలో ఆయన సిఎంను కలిశారు.ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు కుప్పంలో రాజకీయ పరిస్థితులు గురించి లడిగి తెలుసుకున్నారు.అలాగే ప్రస్తుతం జరుగుతున్న అభివృది పనులు చేపట్టాల్సిన అభివృది కార్యక్రమాలపై జిఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వ విప్ డా॥కంచెర్లకు దిశానిర్దేశాలు చేశారు.

## ఎన్టీఎకు సహాయ సహకారాలు

- ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:




నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్టీఎ)కు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు పేర్కొన్నారు. సాంబయ్యకండ్రిగలోని విజయం సిబిఎస్ఇ పాఠశాలలో ఆదివారం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఎన్టీఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ వి.జయప్రకాష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్‌లు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే దిశా నిర్దేశకులన్నారు. ఉపాధ్యాయులకు అన్ని రంగాల్లో ప్రముఖులను తయారు చేసే శక్తియుక్తులు వున్నాయన్నారు. ఇలాంటి గురువుల సమస్యలను పరిష్కరించి వారికి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను ఇప్పించడం ప్రజాప్రతినిధులుగా తమ బాధ్యత అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారించడంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రత్యేక చొరవ చూపడం హర్షనీయమన్నారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సంఘ భవన నిర్మాణానికి జిల్లా కేంద్రం చిత్తూరులో నిర్మించుకోవడానికి ఒక నెలరోజుల్లోపు ప్రభుత్వ ధరకే స్థలం కొనుగోలు చేసి ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాసరాజు, గౌరవ అధ్యక్షులు రెడ్డి రమేష్, ప్రధాన కార్యదర్శి హైమారావు, ఆర్థిక కార్యదర్శి జె.శ్రీనివాసరావు, కార్యదర్శి జరిగొండ సురేష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామయ్య, ఆర్థిక కార్యదర్శి బాబురెడ్డి, రాష్ట్ర, జిల్లా స్థాయి అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.